


# విజయభాను




విశాఖపట్నం, మంగళవారం 28-05-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 223 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# 'మండే' రోజు

- నిప్పుల గుండాలుగా తెలుగు రాష్ట్రాలు
- రోహిణీకార్తె మొదటిలోనే భగభగలు
- రానున్న రోజుల్లో మరింత ఉక్కపోత
- వడగాడ్పులకు వయోవృద్ధుల మృతి




అమరావతి/ హైదరాబాద్ : రెండు తెలుగు రాష్ట్రాలు నిప్పుల గుండాలను తలపిస్తున్నాయి. భానుడి ప్రతాపంతో తెలుగు రాష్ట్రాల ప్రజలు అల్లాడుతున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్నిగుండాన్ని తలపిస్తోంది. రోహిణీ కార్తె ప్రవేశించిన ఒక రోజులోనే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. సాధారణం కంటే మూడు, ఆరు డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాలు అట్టుడికిపోతున్నాయి. జనం ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. గుంటూరు, కృష్ణా, చిత్తూరు, వైఎస్ఆర్, నెల్లూరు జిల్లాల్లో వడగాల్పులు వీస్తున్నాయి. గుంటూరు జిల్లా రెంటచింతల మండలంలోని జంగమహేశ్వరంలో 46డిగ్రీలు, తిరుపతి, విజయవాడ, రాజధాని, తరువాయి 2లో..

# లక్ష్యాలను చేరుకునేందుకు సహకరించండి

## ఐపీఎస్, ఐఏఎస్ అధికారులతో జగన్ భేటీ



అమరావతి: వైకాపా అధినేత, ఏపీకి కాబోయే సీఎం జగన్‌తో పలువురు ఐపీఎస్, ఐఏఎస్, ఉన్నతాధికారులు మర్యాదపూర్వకంగా భేటీ అవుతున్నారు. జిల్లాలకు చెందిన కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు, ఎస్పీలతో పాటు వివిధ శాఖల కార్యదర్శులు తాడేపల్లిలోని జగన్ నివాసంలో ఆయనను కలిసి వెళ్లారు. సీనియర్ అధికారులు కృష్ణబాబు, వర్రపసాద్, సంధ్యారాణి, లక్ష్మీకాంతం, సత్యనారాయణ, ప్రద్యుమ్న, కాటమనేని భాస్కర్, కార్తికేయ మిశ్రా, రవిప్రకాశ్, మేరీ ప్రశాంతి భేటీ అయ్యారు. రాష్ట్రాభివృద్ధితో పాటు నూతన ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు సహకరించాలని ఈ సందర్భంగా అధికారులను జగన్ కోరారు.

మరోవైపు విజిలెన్స్ డీజీ గౌతమ్ సవాంగ్, హైదరాబాద్ రేంజ్ ఐజీ స్టీఫెన్ రవీంద్ర కూడా జగన్‌తో భేటీ అయ్యారు. ఏపీ ఇంటెలెజెన్స్ చీఫ్‌గా నియమితులు కానున్నారనే వార్తల నేపథ్యంలో స్టీఫెన్ రవీంద్ర సమావేశం కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. రవీంద్రను ఇంటెలిజెన్స్ చీఫ్‌గా నియమించుకునే ముందు ఏపీ నుంచి అధికారిక సమాచారం తెలంగాణ ప్రభుత్వానికి వెళ్లాల్సి ఉంటుంది. దీంతోపాటు తెలంగాణ ప్రభుత్వం నుంచి కూడా కేడర్ మార్పుపై అధికారిక ఉత్తర్వులు వెలువడాల్సి ఉంది. ఈ అంశాలపైనే స్టీఫెన్ రవీంద్ర జగన్‌తో చర్చించినట్లు సమాచారం. జగన్ ప్రమాణస్వీకారం తర్వాత రవీంద్ర బాధ్యతలు చేపట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది. తర్వాత రవీంద్ర బాధ్యతలు చేపట్టే అవకాశమున్నట్లు తెలుస్తోంది.



## పోలీసుల అదుపులో హార్ధిక్ పటేల్

- ఆయన భద్రతకోసమే ఆరెస్టు
- సూరత్ పోలీసు కమిషనర్ సతీష్ శర్మ

సూరత్: నిరాహార దీక్షకు సిద్ధమంటూ ప్రకటించిన కాంగ్రెస్ నాయకుడు, పటీదార్ ఉద్యమనేత హార్దిక్ పటేల్‌ను గుజరాత్ పోలీసులు అదుపులోకి తరువాయి 2లో..

## గొప్ప సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం

### దురాచారాలు పారదోలే సంఘసంస్కర్త నవయుగ వైతాళికుడు కందుకూరి

### జిల్లా కలెక్టర్ కె. భాస్కర్



విశాఖపట్నం: సామాజిక దురాచారాల నిర్మూలనకు నిరుపమానమైన కృషిచేసిన మహానుభావుడు, గొప్ప సంఘస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు అని జిల్లా కలెక్టర్ భాస్కర్ కొనియాడారు. కందుకూరి వీరేశలింగం పంతులు వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం బీచ్‌రోడ్‌లో గల శ్రీ కందుకూరి విగ్రహానికి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ జి. సృజన, కలెక్టరేట్‌లో అన్ని విభాగాల సిబ్బందితో ఆయన సమావేశమై కందుకూరి చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగుజాతి గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి, నవయుగ వైతాళికుడు కందకూరి వీరేశలింగం పంతులు అని ప్రశంసించారు. సమాజంలోని దురాచారాలను ఎండగట్టేందుకు 1874 అక్టోబర్‌లో వివేకవర్ధని అనే పత్రికను ప్రారంభించారన్నారు. హాస్య సంజీవని అనే హాస్య పత్రికను ప్రారంభించి ఎన్నో ప్రహసనాలు, వ్యంగ్య రూపకాలు ఈ పత్రికలో ప్రచురించారన్నారు. సమాజ సేవ కొరకు హితకారిణి అనే ధర్మ సంస్థను స్థాపించి, తన యావదాస్తిని దానికి ఇచ్చేశారు. తాను నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉండే వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు అని కలెక్టర్ కొనియాడారు.

జాయింట్ కలెక్టర్ జి. సృజన, జి.వి.ఎం.సి. అదనపు కమిషనర్ మూర్తి తదితరులతో పాటు కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## నేడు తిరుమలకు వైఎస్ జగన్

తిరుపతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్‌కు కాబోయే ముఖ్యమంత్రి వైస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం తిరుమల వెళ్లనున్నారు. బుధవారం ఉదయం ఆయన తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. కాగా వైఎస్ జగన్ రేపు వైఎస్సార్ జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన తాడేపల్లి నుంచి నేరుగా పులివెందుల వెళతారు. అక్కడ నుంచి ఇడుపులపాయ చేరుకుని తన తండ్రి, మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తారు. అదేరోజు సాయంత్రం వైఎస్ జగన్ తిరుమల చేరుకుంటారు. రాత్రి తిరుమలలోనే బస చేసి, బుధవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుంటారు.

### టీటీడీ పాలకమండలిని రద్దు చేయాలి

కాగా ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్న వైఎస్ జగన్ శ్రీవారిని దర్శించుకోనున్నట్లు జీడీ నెల్లూరు ఎమ్మెల్యే నారాయణ స్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం రద్దు అయిన వెంటనే నామినేటెడ్ పోస్ట్‌ల్లో ఉన్నవారు వెంటనే తమ పదవులకు రాజీనామా చేయాలని తరువాయి 2లో..

## రాజకీయాల్లో గెలుపోటములు సహజమే

### గెలిచిన వారు హామీలు నెరవేర్చాలి

### పదవులు ఉన్నా..లేకున్నా పని చేస్తా

### నిజామాబాద్ మాజీ ఎంపీ కవిత



నిజామాబాద్: రాజకీయాల్లో గెలుపోటములు సహజమని నిజామాబాద్ మాజీ ఎంపీ కవిత అన్నారు. ఈ నియోజకవర్గాన్ని ఎప్పటికీ వీడనని చెప్పారు. నిజామాబాద్ నియోజకవర్గ పరిధిలోని మంచికప్పలో తెరాస కార్యకర్త కిశోర్ గుండెపోటుతో మరణించగా.. ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డితో కలిసి ఆమె పరామర్శించారు.

అనంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ.. ఈసారి ప్రజలు నన్ను కాదని వాళ్లని గెలిపించారు. గెలిచినవారు హామీలు నెరవేర్చాలి అని అన్నారు. తెరాస కార్యకర్తలకు మనోధైర్యం తరువాయి 2లో..




## రాహుల్ రాజీనామా తొలిసారి కాంగ్రెస్ స్పందన

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాభవం నేపథ్యంలో ఇందుకు బాధ్యతగా తాను పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటానని రాహుల్‌గాంధీ పట్టుబడుతున్నట్టు వస్తున్న కథనాలపై కాంగ్రెస్ పార్టీ తొలిసారిగా స్పందించింది. అధ్యక్ష పదవి నుంచి రాహుల్ తప్పుకొనే అవకాశమే లేదని దాదాపుగా ధ్రువీకరించింది. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి రణ్‌దీప్ సింగ్ సుర్జేవాల్ సోమవారం.. ఈ నెల 25న జరిగిన సీడబ్ల్యూసీ సమావేశంపై వదంతులు వ్యాప్తి చేయవద్దని ప్రజలను, మీడియాను కోరారు. సీడబ్ల్యూసీ సమావేశంలో రాహుల్ రాజీనామాకు సిద్ధపడ్డారని, అందుకు సీడబ్ల్యూసీ నిరాకరించిందని, అయినా రాహుల్ వెనుకకు తగ్గడం లేదని కథనాలు వస్తున్న సంగతి తెలిసిందే.

సీడబ్ల్యూసీ సమావేశం అంతరంగిక భేటీ అని, ఆ సమావేశంపై పుకార్లు, వదంతులు సృష్టించడం తీవ్ర అవాంఛనీయమని ఆయన స్పష్టం చేశారు. దిద్దుబాటు చర్యలు తీసుకోవడానికి, అభిప్రాయాలను పంచుకోవడానికి సీడబ్ల్యూసీ తరువాయి 2లో..



# బ్రాండిక్స్ నిర్వాసిత మత్స్యకారులకు వెంటనే ప్యాకేజీ (ఉద్యోగాలు) ఇవ్వాలి



అచ్యుతాపురం : బ్రాండిక్స్ పూడిమడక జేఏసీ తో చేసుకున్న ఒప్పందం ప్రకారం మిగిలిన నిర్వాసిత మత్స్య కారులకు వెంటనే ప్యాకేజీ (ఉద్యోగాలు) ఇవ్వాలని పూడిమడక మత్స్య కారులు డిమాండ్ చేస్తు సోమవారం తహశీల్దార్ కి వినతిపత్రం అందజేశారు .బ్రాండిక్స్ పరిశ్రమ సముద్రంలోకి విడుదల చేసే రసాయన వ్యర్థజలాలు వలన జీవనోపాధి కోల్పోయిన పూడిమడక మత్స్యకారులకు నష్ట పరిహారంగా 3000 కుటుంబాలకు గాను 2630 మందికి ఇచ్చి మిగిలిన వారికి ఇవ్వలేదని జేఏసీ కమిటి సభ్యులు ,మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేసారు. శుద్ధిచేయుకుండా నేరుగా రసాయన వ్యర్థజలాలును సముద్రంలోకి విడిచిపెట్టడం వలన మత్స్యసంపద నశించిపోతుందని ఆరోపించారు. వెంటనే పై సమస్యలను 15 రోజులలో పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

వినతిపత్రం అందించినవారిలో వై ఎస్ ఆర్ టియుసి జిల్లా ప్రదాన కార్యదర్శి చోడిపల్లి అప్పారావు, మేరుగు అప్పలనాయుడు, మేరుగు అప్పలరాజు, మత్స్యకారులు ఉన్నారు.

# హనుమజ్జయంతి ఉత్సవములు ప్రారంభం



సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి వారి అనుబంద ఆలయం మెట్లమార్గంలో గల ఆంజనేయస్వామి వారి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవములు సోమవారంగణపతి పూజ పుణ్యహవచనం సుందరాకాండ పారాయణంతో ఘనంగా ప్రారంభమైంది. వైశాఖ బహుళ అష్టమి మొదలుకొని బహుళ దశమి వరకు మూడు రోజులపాటు విశేష ఉత్స ములు జరగనున్నాయి.

ఉత్సవంలో భాగంగా స్వామి వారి ఆలయమందు పంచా మృత అభిశేఖములు, విశేష అర్చనలు, శ్రీరామ పట్టాభి షేక సర్గపారాయణం, పుర్ణా హుతి, భజనలు మరియు ప్రసాద వితరణజరుగునని కావున 27 వ తేదీన జరుగు హనుమజయంతి ఉత్సవంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థ ప్రసా దములు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులుకాగలరని అధికారులు కోరారు.

## ఆర్.టి.యాక్ట్ పై స్పందించని

# భీమిలి మున్సిపల్ అధికారులు



భీమునిపట్నం : భీమిలి సమా చార హక్కు చట్టానికి సంబం ధించి సమాచారాన్ని అర్జీలు పెట్టుకునే దరఖాస్తు దారులు పలు సమాచారాలను పొందే హక్కును జీ.వి.యం.సి అధికారులు తుంగలో త్రొక్కుతున్నా రని బి.జె.పి నగర కార్యవర్గ సభ్యులు ఆర్.కృష్ణ మాచార్యులు ఆరోపించారు. భీమిలి జోనల్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సందర్భంగా ఆయన అధికారులపై పిర్యాదు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భీమునిపట్నం నృసింహస్వామి దేవాలయ భూముల ఆక్రమణలకు సంబంధించిన పలు విషయాలపై అధికారుల యొక్క పాత్ర, మరియు వాటి వివరాల కొరకు, శానిటరీ విభా గానికి సంబంధించిన జమా ఖర్చుల వివరాలపై, మరియు సి.ఆర్.జెడ్ నిబంధనలు సమాచారాన్ని గత కొన్ని నెలలుగా ఆర్.టి.యాక్టు ద్వారా అడిగి నప్పటికీ అధికారుల నుండి తగిన సమాచారం ఇవ్వడం లేదన్నారు. వీటిపై అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ సోమవారం జెడ్సీ గోవిందరావు కి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీనిపై ఉన్నత అధికారులు సమగ్ర విచా రణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బాక్సింగ్ క్రీడాకారులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న - ఎన్ఎఫ్జేయు సభ్యులు



ములగాడ: శ్రీహరిపురం 48వ పరిధిలోగల జోహార్ నగర్ క్రీడా మైదానంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా కిక్ బాక్సింగ్ క్రీడాకారులకు నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ సభ్యులు పౌష్టికాహారాన్ని అందించారు అనంతరం నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా మంచి ప్రతిభను చూపించి ఉన్నత శిఖరాలకు చేరాలని క్రీడాకారులకు నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ సంస్థ తరపునుంచి వారికి సహాయ సహకారాలు అందిస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ కోచ్ సునీల్ మరియు నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ఎస్సీ వింగ్ యూత్ అధ్యక్షులు అనపర్తి సైదా సుదర్శన్ గుండెల బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ హిందీ ప్రేమి మండలి ఆధ్వర్యంలో ఉచితంగా హిందీ పాఠ్యపుస్తకాలు పంపిణీ



భీమునిపట్నం : స్థానిక ఆదర్శ హిందీ ప్రేమి మండలి ఆధ్వర్యంలో హిందీ పరీక్షల కోసం తర్ఫీదు పొందే బాలబాలికల ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో సంస్థ గౌరవ అధ్యక్షులు గంటా నూకరాజు చేతుల మీదుగా 34 మందికి పుస్తకాలు అందజేశారు. సంస్థ అధ్యక్షు లు కె.ఎస్.ఆర్. కృష్ణారావు మాట్లాడుతూ వివిధ హిందీ పరీక్షలకు బాలలకు ఉచిత శిక్షణ ఇచ్చి పరీక్షలకు పంపుతున్నారు. ఈసారి పరీక్షలకు 67 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారని ఇందులో 24 మంది పేద విద్యార్థులకు సుమారు 20 వేల రూపాయలు విలువచేసే పాఠ్య పుస్తకాలు గైడ్స్, పెన్నులు, అందించామని తెలిపారు. శిక్షకురాలు దుర్గా సౌమ్య తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్చార్జ్ ఎంపిడిఒ రవికుమార్

గొలుగొండ : గ్రామాల్లో తాగునీటి ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఇన్చార్జ్ ఎంపిడిఒ రవికుమార్ కార్యదర్శులను ఆదేశించారు. మండల మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం తాగునీరు, ఓటరు జాబితాల కులగణన వంటి అంశాలపై పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడ తాగునీరు సమస్య ఏర్పడకుండా కార్యదర్శి అంతా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లు సత్వరమే పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అలాగే ఓటరు జాబితాల కులగణనను పూర్తి చేసి నివేదికలు అందించాలని అన్నారు. ఈ నెల 31 నాటికల్లా పంచాయతీల ఓటరు జాబితాలో కులాల వారిగా గణనను కార్యదర్శులంతా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఒపిఆర్డి వై.త్రిమూర్తులు, పంచాయతీ కార్యదర్శులు రఘురాం, పూర్ణచంద్రరావు, గౌరీ, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలందించాలి

### డీఎంహెచ్వో చెంచయ్య



భామిని : ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని డీఎంహెచ్వో చెంచయ్య ఆదేశించారు. ముందుగా వైద్య సిబ్బంది హాజరు పట్టికను విధిగా పరిశీలించిన అనంతరం ఆరోగ్య కేంద్రంలో ఉండే అన్ని గదులతో పాటు ఆరోగ్య కేంద్రం పరిసరాలను ఆయన స్వయంగా పరిశీలించి అనంతరం ఆయన ఆరోగ్య కేంద్రంలో చాలా వరకు మరమ్మతులు చేయాల్సి ఉందని వాటిని వెంటనే బాగు చేయించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఆసుపత్రిలో విరివిగా ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ల్యాబొరేటరిని సందర్శించి ఏఏ పరీక్షలు నిర్వహిస్తున్నారు అన్న వాటిపై ఆరా తీశారు. ఏ చిన్న ప్రమాదంతోనైనా ఇక్కడికి వచ్చివారికి మెరుగైన వైద్య సహాయం అందించాలని సూచించారు. ఆరోగ్య కేంద్రంలో లేని మందులను డీఎంఅండ్ హెచ్వో స్టోర్స్ నుంచి తెప్పించుకోవాలని పేర్కొన్నారు.

## ఉత్సాహంగా జిల్లాస్థాయి చదరంగం పోటీలు

శ్రీకాకుళం : జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం నగరంలోని పీఎన్ కాలనీలో గల చదరంగం శిక్షణ కేంద్రంలో జిల్లాస్థాయి అండర్-17, 9 చదరంగం పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీలలో అండర్-17 విభాగంలో వై.సేతుమాధవ్ ప్రథమ స్థానం సాధించగా, బొమ్మన యశ్వంత్ 2వ స్థానం, బొమ్మాలి భీమతేజ 3వ స్థానం, సిగిలిపల్లి హితేష్ 4వ స్థానంలో నిలిచారు.

**మొదటి పేజీ తరువాయి**

## 'మండే' రోజు

అమరావతిలో 45డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్టు భారత వాతావరణ శాఖ తెలిపింది.

రానున్న మూడు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఉష్ణోగ్రతలు మూడు, నాలుగు డిగ్రీలు అధికంగా నమోదవుతాయని అంచనా వేస్తున్నారు. మరో వారంపాటు ఉష్ణోగ్రతలు మరింతగా పెరిగే పరిస్థితులు ఉన్నాయని చెప్తున్నారు. ఏపీలో కనిష్ట ఉష్ణోగ్రతలు కూడా పెరుగుతున్నాయి. రాత్రి వేళ పలుచోట్ల 28 నుంచి 33 డిగ్రీలు నమోదవుతున్నాయి. అంటే ఇవి సాధారణం కంటే నాలుగు, ఆరు డిగ్రీలు అధికం. ఫలితంగా రాత్రి వేళ కూడా ఉష్ణతీవ్రతతో కూడిన గాలులు వీస్తున్నాయి. మరోవైపు వడగాల్పులకు విజయనగరం జిల్లాలో ఒకరు, గుంటూరు జిల్లాలో ఇద్దరు మృతిచెందినట్టు సమాచారం.

**బెదిరిపోతున్న బెజవాడ వాసులు**

భానుడు ప్రతాపానికి బెజవాడ వాసులు బెదిరిపోతున్నారు. రోళ్లు పగిలే రోహిణీ కార్తె ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రోహిణీ కార్తెలో రోళ్లు పగిలే ఎండలు ప్రజలకు చుక్కలు చూపిస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండటం, గాలిలో తేమ శాతం పెద్దఎత్తున పడిపోతుండటంతో ప్రజలు అల్లాడిపోతున్నారు.

ఇక తెలంగాణ రాష్ట్రంలోని 20 ప్రాంతాల్లో 47 డిగ్రీలు కన్నా ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడం, నిజామాబాద్లో 17, హైదరాబాద్లో 20 శాతానికి గాలిలో తేమ శాతం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. తెలంగాణలోని 20 గ్రామాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో... వాతావరణ శాఖ ప్రమాద హెచ్చరికలు జారీ చేసింది. మంచిర్యాల జిల్లా వేమన్పల్లి మండలం నీల్వాయి గ్రామంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 47.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయిందని ప్లానింగ్ డెవలప్మెంట్ సొసైటీ వెల్లడించింది.

## పోలీసుల అదుపులో హార్థిక్ పటేల్

తీసుకున్నారు. ఓ కోచింగ్ సెంటర్లో 22 మంది విద్యార్థులను బలితీసుకున్న అగ్ని ప్రమాదంపై సూరత్ మేయర్ సహా ఇతర అధికారులపై గుజరాత్ ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హార్దిక్ డిమాండ్ చేస్తున్నారు. ఘటనా స్థలం వద్ద ఆందోళన చేపట్టేందుకు అనుమతి ఇవ్వాలంటూ కాంగ్రెస్ కోరినా పోలీసులు అంగీకరించలేదు. అయినప్పటికీ ఘటనా స్థలం వద్దకు వెళ్లేందుకు హార్దిక్ ప్రయత్నించినట్టు సూరత్ పోలీస్ కమిషనర్ సతీశ్ శర్మ పేర్కొన్నారు.

శుక్రవారం అగ్ని ప్రమాదం చోటుచేసుకున్న సర్థానా ప్రాంతంలో నిరాహార దీక్ష చేపడతానంటూ హార్దిక్ ప్రకటించారనీ.. అందుకే పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారని అధికారులు వెల్లడించారు. ధర్నా చేసేందుకు హార్దిక్ అనుమతి కోరారు. అయితే ఆయన ఆదివారమే ఘటనా స్థలాన్ని సందర్శించడం, ఆయన ప్రత్యర్థి వర్గీయులు ఆయనపై దాడికి ప్రయత్నించడంతో మేము అనుమతి నిరాకరించాం. ఇది ఆయన భద్రతకు సంబంధించిన విషయం. రోజూ అక్కడికి వెళ్తానంటే ఎలా అనుమతిస్తాం...? అని సూరత్ సీపీ ప్రశ్నించారు.

## నేడు తిరుమలకు వైఎస్ జగన్

డిమాండ్ చేశారు. అలాగే టీడీపీ పాలకమండలిని కూడా వెంటనే రద్దు చేయాలని, వారు తమ పదవులుకు రాజీనామా చేయాలన్నారు. అలాగే నేటి ఉదయం జరిగే పాలకమండలి సమావేశాన్ని కూడా రద్దు చేయాలని నారాయణస్వామి అన్నారు.

రాజీనామా చేసిన రాఘవేంద్రరావు

శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ చైర్మన్ పదవికి దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు రాజీనామా చేశారు. వయోభారం వల్ల చైర్మన్ పదవికి రాజీనామా చేసినట్టు ఆయన తెలిపారు. టీటీడీ యాజమాన్యానికి, సిబ్బందికి ఆ తిరుమలేశుడి ఆశీర్వాదాలు ఉండాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. తనకు ఇన్నాళ్లు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## రాజకీయాల్లో గెలుపోటములు సహజమే

కోల్పోవద్దని సూచించారు. ప్రజల మధ్య ఉంటూ.. అందరికీ అందుబాటులో ఉంటానని మాటిచ్చారు. పదవులు ఉన్నా..లేకున్నా తెలంగాణ కోసం పని చేస్తానని వెల్లడించారు. ఓటమితో నిరాశ చెందకుండా తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేస్తానని చెప్పారు.

## రాహుల్ రాజీనామా.. తొలిసారి కాంగ్రెస్ స్పందన

ఒక ప్రజాస్వామిక వేదిక. ఆంతరంగికంగా జరిగే ఈ భేటీ పవిత్రతను కాపాడాలి. ఈ విషయమై ఒక వర్గం మీడియాలో వస్తున్న వదంతులు, పుకార్లు, కథనాలు అవాంఛనీయం అని సుర్జేవాల ట్వీట్ చేశారు. తద్వారా రాహుల్ రాజీనామా ఉండబోదని ఆయన పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు.

# మా ఎమ్మెల్యేలు బీజేపీలోకి వెళ్లరు

బెంగళూరు: కర్ణాటకలోని అధికార కాంగ్రెస్-జేడీఎస్ కూటమి ప్రభుత్వానికి వచ్చిన ఇబ్బందేమీ లేదని ఆ రాష్ట్ర మంత్రి, కాంగ్రెస్ నేత ఎంబీ పాటిల్ స్పష్టం చేశారు. తమ ఎమ్మెల్యేలు ఎవరూ బీజేపీలోకి వెళ్లబోరని పేర్కొన్నారు. మా పార్టీ ఎమ్మెల్యేలు ఎవరూ బీజేపీలోకి వెళ్లడం లేదు. ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు వారు (బీజేపీ నేతలు) గతంలో ప్రయత్నించారు. ఇప్పుడూ అదే పనిచేస్తున్నారు. భవిష్యత్తులోనూ ప్రయత్నిస్తారు. మా ప్రభుత్వం పూర్తికాలం అధికారంలో ఉంటుంది అని పాటిల్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేలైన రమేశ్ జార్కిహోళి, సుధాకర్లు బీజేపీ నేత ఎస్ఎం కృష్ణను ఆయనను నివాసంలో కలిశారు. దీంతో ఒక్కసారిగా కర్ణాటకలో కలకలం మొదలైంది. వారిద్దరూ బీజేపీలో చేరబోతున్నట్టు వార్తలు వచ్చాయి. దీంతో స్పందించిన పాటిల్ ఈ వ్యాఖ్యలు చేశారు.

తాము బీజేపీ తీర్థం పుచ్చుకోబోతున్నట్టు వచ్చిన వార్తలపై గోకక్ ఎమ్మెల్యే జార్కిహోళి స్పందిస్తూ లోక్సభ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించడంతో అభినందించడానికి వెళ్లానని వివరణ ఇచ్చారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోని 28 లోక్సభ స్థానాలకు గాను 25 స్థానాలను బీజేపీ గెలుచుకుంది. కాంగ్రెస్-జేడీఎస్ కూటమి రెండు స్థానాల్లో విజయం సాధించింది. కర్ణాటకలో అతిపెద్ద పార్టీ అయిన బీజేపీకి 105 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. మెజార్టీ మార్కు 113 కాగా, ఇంకా 8 మంది ఎమ్మెల్యేలు తక్కువగా ఉన్నారు.

# మాజీ ప్రధానుల ఐటీ రిటర్నుల వివరాలు లేవు

న్యూఢిల్లీ: మాజీ ప్రధానులు చెల్లించిన ఆదాయపు పన్ను వివరాలేవీ తమ వద్ద లేవని ప్రధాన మంత్రి కార్యాలయం తెలిపింది. సమాచార హక్కు చట్టం కింద దాఖలైన ఓ అప్లికేషన్కు సమాధానంగా ఈ వివరాలు వెల్లడయ్యాయి. మాజీ ప్రధానుల గౌరవార్థం వారు చెల్లించిన ఆదాయపు పన్ను సంబంధిత వివరాలేవీ మా వద్ద రికార్డు చేయలేదు అని అని పీఎంఓ పేర్కొంది.

మాజీ ప్రధానులతో పాటు మాజీ కేంద్ర మంత్రులకు సంబంధించిన ఆదాయపు పన్ను వివరాలను తెలియజేయాలని కోరుతూ ప్రధాన మంత్రి కార్యాలయానికి ఓ అప్లికేషన్ వచ్చింది. అంతే కాకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదాయపు పన్ను వివరాల్ని వెల్లడించేందుకు సమాచార హక్కు చట్టం కింద మినహాయింపును ఇచ్చినట్లు పేర్కొన్నారు.

సమాచార హక్కు చట్టం సెక్షన్ 8 (1) (జే) కింద కొన్ని వివరాల్ని వెల్లడి చేయాల్సిన అవసరం లేదని అప్లికేషన్ దారునికి పంపిన లేఖలో పీఎంవో పేర్కొన్నారు.

# కార్యకర్తలకు కేజ్రీవాల్ పిలుపు

న్యూఢిల్లీ : రాజకీయాల్లో అవమానాలు సహజం.. జరిగిపోయిన దానిని వదిలేయండి.. రానున్న అసెంబ్లీ ఎన్నికల కోసం కష్టపడి పని చేద్దామంటూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల్లో ఆప్ ఘోర పరాజయాన్ని మూట కట్టుకున్న సంగతి తెలిసిందే. ఏడు లోక్సభ స్థానాల్లో కనీసం ఒక్క చోట కూడా గెలవలేకపోయింది. బీజేపీ ఏడు స్థానాల్లో భారీ మెజరిటీతో విజయం సాధించి ఢిల్లీలో క్లీన్ స్వీప్ చేసింది. ఈ నేపథ్యంలో ఫలితాల అనంతరం తొలిసారి కార్యకర్తలతో సమావేశమయ్యారు కేజ్రీవాల్.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజకీయాల్లోకి రావాలనుకునే వారికి లేదా జనాలతో కలిసి సాగుదామనుకునే వారికి అవమానాల్ని ఎదుర్కొనే ధైర్యం ఉడటం చాలా అవసరం అని అన్నా హజారే చెప్తుంటారు. మనం చాలా అవమానాల్ని చవి చూశాం. వాటన్నింటిని చాలా గౌరవంగా స్వీకరించిన నా కార్యకర్తలను చూస్తే నాకు చాలా గర్వంగా ఉంది. ఫలితాల గురించి నిరాశ చెందవద్దు. భారీ ఎన్నికలు ముగిసాయి.. త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఢిలీ ప్రజల దగ్గరకు వెళ్లి ఒకే మాట చెప్పండి. పేరును కాకుండా పని చూసి ఓటు వేయండి అని ప్రచారం చేయండి అంటూ కార్యకర్తలకు కేజ్రీవాల్ పిలుపునిచ్చారు.



# క్రీడామైదానం ఖాళీ చేయాలి

### కాంట్రాక్టర్ విజయారెడ్డి పై చర్య తీసుకోవాలని గిరిజన సంఘం ఆద్వర్యంలో గ్రామస్తులు ధర్నా

అనంతగిరి : మండలం లోని పోషకులు పంచాయతీ లో టోకురు గ్రామంలో క్రీడా మైదానాన్ని సుమారు నాలుగు లక్షల రుపాయలు యన్ ఆర్ ఈ జియస్ నిధులతో గత సంవత్సరం బి, సుభశేఖర్ అనే ఆసామి అభివృద్ధి చేసియున్నారు బిల్లులు రాక మునుపే విజయారెడ్డి అనే కాంట్రాక్టర్ పంచాయతీ రాజ్ డిపార్ట్ మెంట్ (డబ్ల్యూ బి ఎమ్ , జిస్ పి) పంచాయతీ గాని గ్రామస్తుల అనుమతి లేకుండా సుమారు 500 లారీలరోడ్లు మెటీరియల్ ను మైదానంలో వేసియున్నారు ఒక సంవత్సరం అవుతున్నా మెటీరియల్ గురించి పట్టించుకోవడం లేదు ఖాళీ చేయమన్నా చేయుటలేదు క్రీడలకు పనికి రాకుండా చేసియున్నారు క్రీడా మైదానాన్ని చేసిన కాంట్రాక్టర్ కు సుమారు 25000 రు నష్టపరిచియున్నారు, గ్రామస్తులు రోడ్డు కాంట్రాక్టర్ విజయారెడ్డి ని సంప్రదించడానికి ప్రయత్నం చేసినా చరవాణి ఎత్తుటలేద, ఈవిషయం పై అనంతగిరి పోలీసువారికి అనంతగిరి ఎమ్పీడిఓగారికి వినతి పత్రం లు సమర్పించారు. ఈకార్యక్రమంలో మొసియా టోకురు గ్రామస్తులు పాల్గొన్నారు.

# నవరాత్నలుతోనే రాష్ట్ర అభివృద్ధి

## 55వ వార్డు అద్యక్షుడు బట్టు సన్యాశిరావు



పరవాడ: నవరాత్నలుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంందనీ 55వ వార్డు అద్యక్షులు బట్టు సన్యాశి రావు అన్నారు. ఈవార్డులో ప్రజలు వైసిపి అభ్యర్ధి అన్నంరెడ్డి అదీప్ రాజ్ కు అత్యదిక ఒట్లు వేసారు. ప్రభుత్వ విదానాలు నచ్చకే ప్రజలు వైసిపికి పట్టం కట్టారు. సంక్షేమ పధకాలు అమలులో టిడిపి పూర్తిగా విఫలమైందని అన్నారు. కేవలము టిడిపి నాయకులు, కార్యకర్తలకే పథకాలు అందాయి అనీ, మిగతా సామాన్యలుకు పదకాలు అందలేదు అని అన్నారు. ఈ పధకాలు అందడములో కూడా మామూళ్ళు ఇవ్వాల్సిందే అని అన్నారు. స్దానిక మాజీ ఎమ్మేల్యే కుమారుడు చేసిన పనులుకు ప్రజలు విసిగిపోయారు అని అన్నారు. ఎదురించిన వారిని తోక్కేయడము, పెద్ద వారు పట్ల గౌరవము లేక పోవటము, పనుల్లో మాముళ్ళు, భూకబ్జాలు తథితర అంశాలుపై కీలక పాత్ర పోషించిన విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ అక్రమాలు అన్నింటిని ప్రత్యర్ధి అభ్యర్ధి అన్నంరెడ్డి అదీప్ రాజ్ ప్రజలోకి తీసుకు వెళ్ళటము, ప్రజలు పక్షాన్ని పోరాడటము, యువతకు ప్రాదన్యత ఇవ్వటము, సేవా కార్యక్రమాలు చేపట్టడము తథితర అంశాలు అన్ని అదీప్ రాజ్ గెలుపుకు కారణాలుగా చెప్పవచ్చు అని అన్నారు. అవినీతి పాలనకు చరమ గీతము పాడి వైసిపికి పట్టం కట్టారనీ అన్నారు. రాష్టము అభివ ృద్ధి జగన్ తోనే సాద్యపడతుందనీ అన్నారు. రాజన్న రాజ్యన్ని మరల జగన్ అన్నతోనే సాద్య పడతుందనీ అన్నారు.

# పాఠశాల ఏర్పాటు చేయాలని ధర్నా



నర్సీపట్నం: రోలుగుంట మండలం లోసింగి, రావికమతం మండలం అజెపురం గ్రామాల్లో పాఠశాలను ఏర్పాటు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి మాట్లాడుతూ రోలుగుంట మండలం శరభవనం పంచాయతీలో రెవెన్యూ గ్రామమైన లోసింగి అనుకొని పెద్దగోరువు, పిత్రగెడ్డ, పాతలోసింగిలో ఆదివాసీలు 70 కుటుంబాలు ఉన్నాయన్నారు. వీరిలో 60 మంది పిల్లలు 5 సంవత్సరాల నుంచి 10 సంవత్సరాల వయస్సు గల వారు ఉన్నారన్నారు. వీరి చదువుకోవాలంటే ఐదు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఎంబి.పట్నం పంచాయతీ రాజన్నపేట గ్రామంలో ఉన్న ఎంపిపి స్కూల్‌కు వెళ్లాల్సి వస్తుందని, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతో పిల్లలను బడికి పంపించడం లేదన్నారు. రావికమతం మండలం చీమలపాడు పంచాతయీ అజెపురం, పెద్దగోరువు గ్రామంలో 40 మంది పిల్లలు ఉన్నారన్నారు. వీరు పాఠశాలకు వెళ్లకుండా పశువులను కాస్తున్నారన్నారు. ప్రభుత్వం పిల్లలను బడిలో చేర్పించాలని, బడికి పోదాం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తుందని, కానీ ఈ గ్రామాల్లో ఒక్క పాఠశాల కూడా ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు.

వెంటనే ఆయా గ్రామాల్లో పాఠశాలలను ఏర్పాటు చేసి పిల్లలకు విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పి.వెంకటరావు, మహేష్, గ్రామాల పిల్లలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



నాతవరం: త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి సత్తా చాటాలని నాతవరం వైసిపి నాయకులు అంకంరెడ్డి జమీలు అన్నారు. సోమవారం నాతవరం కళ్యాణ మండలంలోని 27 పంచాయతీ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జమీలు మాట్లాడుతూ వైసిపి ఘన విజయం వెనుక పార్టీ కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. పార్టీ విజయం కోసం కష్టపడి పని చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జగన్‌తోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసిపి గెలుపుకు అందరూ శ్రమించాలన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కార మార్గం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల పార్టీ అధ్యక్షులు శెట్టి నూకరాజు, నాయకులు పైల పోతురాజు, పైల సునీల్, 27 పంచాయతీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిద్ధార్ధ స్కూల్లో ఉచిత విద్య, భోజన వసతి

## స్కూల్ ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు

రావికమతం: రావికమతం సిద్దార్ధ స్కూల్ ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో బెస్ట్ ఎవైలబుల్ స్కూల్‌గా ఎంపిక కాబడిందని ఆ స్కూల్ ప్రిన్సిపాల్ పరమేశ్వరరావు తెలిపారు.

ఈ మేరకు తమ స్కూల్‌లో ఎస్సీ, ఎస్టీ విద్యార్ధులకు ఉచిత భోజనం, విద్య అందించడం జరుగుతుందన్నారు. తమ పాఠశాల ఎంపిక కాబడినందుకు విద్యార్ధులు, వారి తల్లిదండ్రుల కృషి ఎంతో ప్రశంసనీయమని ఈ సందర్భంగ ఆయన తెలియజేశారు. తీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు 1 నుంచి 5వ తరగతి వరకూ ఎస్సీ విద్యార్ధులు, 3వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ ఎస్సీ విద్యార్ధులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

# రెండు నెలల్లో వంతెన పూర్తి చేయిస్తా

యలమంచిలి రూరల్: యలమంచిలి పట్టణ ప్రజలకు ప్రధాన సమస్యగా మారిన పై వంతెన పనులు రెండు రోజుల్లో పూర్తి చేయిస్తానని ఎమ్మెల్యేగా గెలుపొందిన కన్నబాబురాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వంతెన పనులకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించానన్నారు. ఇంత వరకు దీన్ని టీడీపీ నాయకులు పూర్తి చేయలేకపోయారని చెప్పారు. ప్రమాణ స్వీకారం చేయగానే వంతెన పనులపైనే దృష్టిసారిస్తానన్నారు. పూర్తి చేసి కష్టాలు తీరుస్తానని హామీ ఇచ్చారు. పై వంతెన పనులు ఎంత అవసరమో తనకు తెలుసని చెప్పారు. వంతెన పూర్తి కాక బస్సులు యలమంచిలికి రావడం లేదన్నారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ సమస్యపైనా దృష్టిసారిస్తానన్నారు. ఆక్రమణ తొలగించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేస్తానన్నారు. వంతెన పూర్తి చేయించాలన్నదే నా లక్ష్యమన్నారు.

# ఆదివాసీ గ్రామాల్లో నీటి కోసం ఇబ్బందులు

## పేతురుగెడ్డ గ్రామస్థుల అగచాట్లు

రోలుగుంట: ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసేకన్నా తమ సమస్యను తామే పరిష్కరించుకునే ప్రయత్నాలకు దిగారు శరభవరం పంచాయతీ శివారు పేతురుగెడ్డ గ్రామస్థులు. ఈ గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారికి ఏ విధమైన తాగునీటి సదుపాయం లేదు. కొండల్లో పారే ఊటగెడ్డ నీటినే వాడుకునే వారు. ఈ ఏడాది మండుతున్న ఎండలు కారణంగా ఊటనీరు కూడా ఆగిపోయింది. దీంతో గ్రామస్థులు నీటి కోసం చెలమలు తవ్వుకుంటున్నారు. ఆ కుంతలలో వచ్చే గుక్కెడి నీటికోసం పడిగాపులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

నీరు పడితే వేసవిలో నీటి సమస్య నుంచి గట్టెక్కుతామని ఆశ పడుతున్నారు.

# డౌనూరులో ఇద్దరు వైద్యులనూ కొనసాగించాలి

కొయ్యూరు: డౌనూరు ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులను కొనసాగించాలని కోరుతూ మాజీ సర్పంచ్‌లు విశాఖపట్నం డిఎంఅండ్‌హెచ్‌ఒ తిరుపతిరావును కోరారు.

డౌనూరులో ఇద్దరు వైద్యులను నియమించారని, అయితే వారి వరప్రసాద్ అనే వైద్యాధికారిని పిఒ బాలాజీ మరో ప్రాంతానికి డిప్యూటేషన్ వేశారని తెలిపారు. అతని డిప్యూటేషన్ నిలిపివేయాలని, ఇద్దరు వైద్యులను కొనసాగించాలని కోరారు.

డిఎంఅండ్‌హెచ్‌ఒ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. ఇతర అధికారులతో మాట్లాడి ఇద్దరు వైద్యులను కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# జివిఎంసి గ్రీవెన్సుకు 95 పిర్యాదులు

విశాఖపట్నం: జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్సుడేలో మొత్తం 95 ఫిర్యాదులు అందాయి. జివియంసి అదనపు కమిషనర్ జివివియస్ మూర్తి ప్రజల నుండి విజ్ఞప్తులు స్వీకరిస్తూ వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అందిన మొత్తం 95 పిర్యాదులలో ప్రధాన కార్యాలయానికి సంబంధించి 46 ఫిర్యాదులు అందాయి. ఒకటవ జోన్‌కు సంబంధించి 3, నాలుగవ జోన్‌కు సంబంధించి 2, ఐదవ జోన్‌కు సంబంధించి 36, ఆరవ జోన్‌కు సంబంధించి 7, అనకాపల్లి జోన్‌కు సంబంధించి ఒకటి ఫిర్యాదులందాయి. వీటిలో టౌన్‌ప్లానింగ్ విభాగంకు సంబంధించి 36, ప్రజారోగ్యవిభాగానికి సంబంధించి 4 , ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 27, హార్టికల్చర్ విభాగంకు సంబంధించి రెండు, డిప్యూటి కమిషనర్ రెవిన్యూ విభాగంకు 10, యుసిడి విభాగానికి సంబంధించి ఒకటి, ఇతరులకు సంబంధించి 15 పిర్యాదులు అందాయి.



# కాపు కళ్యాణమండపం కోసం స్థలం కేటాయించండి

## ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసిన కాపునాడు




విశాఖపట్నం : బీమిలి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన ముత్తంశెట్టి శ్రీనివాస్ ను విశాఖ సిటీ కాపునాడు వెల్ఫేర్ అసోసియేషన్ ఘనంగా సత్కరించింది. సోమవారం ఉదయం ,మేఘాలయాలో జరిగిన ఒక కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గుంటూరు వెంకట నరసింహారావు ఆధ్వర్యంలో అవంతి శ్రీనివాస్ ను గజమాల వేసి శాలువాతో సత్కరించి మెమెంటో ప్రధానం చేశారు . ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు విశాఖ నగరంలో కాపుల కల్యాణమండపం కోసం స్థలం కేటాయిస్తే తాము నిర్మించుకుంటామని అవంతి దృష్టికి తీసుకువచ్చారు. సామాజికంగా, రాజకీయంగా ఆర్థికంగా వెనకబడిన కాపులకు చేయూత అందించాలని కోరారు . కాపులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని కోరగా సానుకూలంగా స్పందించారు . కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు గుంటూరు వెంకట నరసింహారావు , అసోసియేషన్ కార్యదర్శి వంగా వెంకట ప్రభాకర్, కార్యదర్శి అడబాల పాండు రంగారావు, ఉపాధ్యక్షులు తోట దుర్గారావు, మేఘనాథ్ , నిర్వాహక కార్యదర్శి ఈశ్వరావు, సంయుక్త కార్యదర్శి రామన్నపాత్రుడు ,కాపునాడు ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డయల్ యువర్ కమిషనర్‌కు 18 ఫిర్యాదులు

విశాఖపట్నం: జి.వి.యం.సి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్ (నెంబరు 1800-4250-0009) కార్యక్రమానికి 18 ఫిర్యాదులు అందాయి. ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వై.మంగపతిరావు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమానికి హాజరై పలువురి నుండి వచ్చిన ఫోన్ కాల్స్‌కు సమాధానం చెప్పారు. ఇందులో ఒకటవ జోన్‌కు సంబంధించి రెండు, రెండవ జోన్‌కు సంబంధించి ఐదు, మూడవ జోన్‌కు సంబంధించి మూడు, నాలుగవ జోన్‌కు సంబంధించి ఒకటి, ఐదవ జోన్‌కు సంబంధించి రెండు, ఆరవ జోన్‌కు సంబంధించి నాలుగు, అనకాపల్లి జోన్‌కు సంబంధించి ఒకటి ఫిర్యాదులు అందాయి. సంబంధిత అధికారులు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి మూడురోజులులోగా నివేదిక సమర్పించాలని కోరారు.

# కోడిగుడ్లులోడుతో వస్తున్న వ్యాన్ బోల్తా



గాజువాక: అనపర్తి నుంచి గాజువాకకు కోడిగుడ్లలోడుతో వస్తున్న వ్యాన్ అదుపుతప్పి బోల్తా పడింది. వ్యాన్‌లో ఉన్న కోడిగుడ్లు అన్ని నేల పాలవగా, డ్రైవర్‌కు స్వల్పగాయాలైయ్యాయి. గుడ్లు అన్ని నేలపాలవడంతో సా&థనికులు గుడ్లుకోసం ఎగబడ్డారు. వడ్లపూడి ప్రధాన రహదారి బస్‌స్టాప్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున ఈసంఘటన చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాలప్రకారం......అనపర్తి నుంచి గాజువాక కు కోడిగుడ్లు సప్లై చేసేందుకు వస్తుండగా మార్గమద్య వడ్లపూడి ప్రధాన రహదారి సమీపంలో వాహనంకు బ్రేకులు సరిగా పడకపోవడంతో వాహనం అదుపు తప్పిందని తెలిపారు. సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వ్యాన్ ను పక్కకు తీసి పరిస్థితిని చక్కదిద్దారు. గాయాలపాలైన డ్రైవర్‌ను వైద్యం కోసం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వ్యాపారులంతా సహకరించాలి

## డిఎస్పీ ప్రసాద్



అనకాపల్లి: పట్టణంలోని రోజు రోజుకి పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి వ్యాపారులంతా సహకరించాలని డిఎస్పి ప్రసాదరావు అన్నారు. సోమవారం శారదనగర్ వద్ద గల మహర్షి ఫంక్షన్ హాలులో షాపింగ్‌మాల్స్, లాడ్జిలు, వైన్ షాపులు, హొటళ్లు తదితర వ్యాపారుల యాజమాన్యలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క వ్యాపారి షాపింగ్ లోపలే కాకుండా బయట కూడా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మధ్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.రోడ్లపై సెల్‌ఫోన్‌లలో మాట్లాడుతూ నడిచే వారిపై కేసులు నమోదు చేయాలని సిబ్బందికి ఆదేశాలను ఇచ్చారు. విహారయాత్రలకు కానీ , బంధువుల ఇళ్లలకు కానీ ,కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లేటప్పుడు ఎల్‌హెచ్‌ఎమ్‌ఎస్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఇందుకు గాను ఆయన స్టేషన్ పరిధిలో గల పోలీస్‌వారికి సమాచారాన్ని అందజేయాలని వీరు కోరారు. పట్టణంలో దొంగతనాల నివారణకు 24 గంటలు 8 బ్లూకోట్ టీమ్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని శాఖల అధికార్లు, వివిధ శాఖల సంస్థలకు చెందిన ప్రతినిధులతో ట్రాఫిక్ అడ్వైజర్ కమిటీని త్వరలో ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. వైన్ షాపుల యాజమానులు, బెల్టుషాపులు నిర్వహిస్తే సెక్షన్ 36ఏ ప్రకారం యజమానిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. లాడ్జీల యజమానులు లాడ్జికి వచ్చే వారి నుండి ఆధార్‌కార్డ్, పూర్తి అడ్రస్‌తో పాటు సెల్‌ఫోన్ నెంబర్‌ను తీసుకోవాలని అన్నారు. పట్టణంలో గల విద్యాసంస్థల్లో ట్రాఫిక్ సమస్యలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరుగుతుందని డిఎస్పి ప్రసాదరావు అన్నారు. తోపుడు బళ్లు వ్యాపారులకు త్వరలోనే ప్రత్యేక స్థలాలను కేటాయించడం జరుగుతుందని, కేటాయించిన స్థలాల్లోనే అమ్మకాలు జరపాలని డిఎస్పి ప్రసాదరావు అన్నారు.ఈ సమావేశంలో పట్టణ సిఐ తాతారావు, ట్రాఫిక్ కిరణ్‌కుమార్, ఎస్సైలు స్వామినాయుడు, రాము తదితరులు పాల్గొన్నారు..

# అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు





సింహాచలం: :శ్రీ వరాహలక్ష్మీనరసింహస్వామి వారిని వై ఎస్ ఆర్ సి పి మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు ఎక్స్ అడ్వకేట్ జెనెరల్ వేణుగోపాల్ మొదలుగు ప్రముఖులు సోమవారం స్వామివారిని దర్శించుకున్నారు . సింహగిరికి చేరుకున్న వీరికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వాగతం పలుకగా .బేడా ప్రదిక్షణ కప్పస్థంబ ఆలింగనం అనంతరం అంతరాలయంలో అర్చకస్వాములు వీరి గోత్రనామములతో ప్రత్యేక అర్చనలు చేసారు . అనంతరం లక్ష్మీ అమ్మవారి దర్శనం చేసుకున్నవీరికి ఆలయ వైదికులు వేద అశీర్వచనం పలుకగా ఆలయ ఏ ఈ ఓ ఆర్ వి ఎస్ ప్రసాద్ గారు వీరికి స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు.

# విజయభాను

## సంపాదకీయం

## ప్రతిపక్ష బలహీనత

లోక్‌సభ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పొందడమే కాకుండా రెండవసారి కూడా ప్రతిపక్ష హోదా పొందకపోవడం నాయకత్వ బలహీనతను వెల్లడిస్తున్నది. లోక్‌సభలో ప్రతిపక్ష హోదా పొందాలంటే కనీసం పది శాతం, యాభై ఐదు సీట్లు ఉండాలె. 2014 ఎన్నికలలో 44 స్థానాలకే పరిమితమైన కాంగ్రెస్ ఈసారి దేశవ్యాప్తంగా 52 సీట్లు మాత్రమే గెలుచుకున్నది. ఒకప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్నట్టి కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు 17 రాష్ట్రాలలో ఒక్క సీటు కూడా సాధించలేకపోవడం ఆశ్చర్యకరమే. ఈ పదిహేడు రాష్ట్రాలలో ఈశాన్య ప్రాంత చిన్న రాష్ట్రాలే కాదు, రాజస్థాన్, గుజరాత్ వంటి పెద్ద రాష్ట్రాలు కూడా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌లో సోనియా గెలిచిన రాయ్‌బరేలీని మినహాయిస్తే మరొక్కసీటు కూడా గెలుచుకోలేదు. రాహుల్‌గాంధీ అమేథీలో ఓడిపోయా రు. తాము పదిహేడు రాష్ట్రాలలో యాభై శాతానికి పైగా ఓట్లు గెలుచుకున్నామని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా వెల్లడించారు. బీజేపీకి నాలుగు రాష్ట్రాలలో మాత్రమే ప్రాతినిథ్యం లేదు. ఈ నాలుగు రాష్ట్రాలు- కేరళ, పుదుచ్చేరి, ఏపీ, తమిళనాడు దక్షిణాదివే కావడం విశేషం. ఒకప్పుడు హిందీ రాష్ట్రాలకే పరిమితమైన బీజేపీ కొత్త ప్రాంతాలకు చొచ్చుకొని వస్తుంటే, కాంగ్రెస్ పార్టీ బలహీనంగా నిలిచిపోతున్నది. మోదీ నాయకత్వంలోని బీజేపీ ఉధృతికి కాంగ్రెస్, ఇతరపక్షాలు నిలబడలేక పో యిన మాట వాస్తవమే. కానీ బీజేపీ బలంతో పాటు ప్రతిపక్షాల బలహీనత చర్చించుకోదగిన విష యం. కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీ నాయకత్వం లోపం ఈ ఎన్నికలలో కూడా స్పష్టం గా కనిపించింది. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుడికి కూడా ప్రధాన పాత్ర ఉంటుంది. ప్రతిపక్ష నేతను కాబో యే ప్రధానిగా పేర్కొంటారు. కొన్ని కీలక పదవులను భర్తీచేసే కమిటీలో ప్రతిపక్ష నేతను కూడా చేర్చవలసి ఉంటుంది. గత లోక్‌సభలో కాంగ్రెస్ పార్టీకి ప్రతిపక్ష హోదా లేకపోవడంతో పెద్ద సంఖ్య గల ప్రతిపక్ష పార్టీని సంప్రదించే విధంగా నిబంధనలను మార్చవలసి వచ్చింది. సీవీసీ, సీబీఐ డైరెక్టర్ పదవులను ఈ విధంగా భర్తీ చేయవలసి వచ్చింది. ప్రతిపక్షానికి ఉన్న ప్రాధాన్యం ఎంతటిదో దీనివల్ల తెలుస్తున్నది. కాంగ్రెస్ పార్టీ పదేం డ్లు అధికారంలో ఉన్నప్పటికీ, కనీసం మంత్రి పదవి స్వీకరించని రాహుల్‌గాంధీ గత లోక్‌సభ లో కాంగ్రెస్ శాసన సభాపక్ష నేత స్థానాన్ని కూడా స్వీకరించకుండా ఖర్గేకు అప్పగించారు. గెలుపోటములతో నిమిత్తం లేకుండా వీలైనంత వరకు క్రియాశీలంగా, బాధ్యతలు మోసే విధం గా ఉండటం రాజకీయ నాయకుడి లక్షణం. కానీ రాహుల్‌గాంధీలో అటువంటి సహజాతాలు కనిపించడం లేదు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి స్వీకరించడానికి ముందునుంచే రాహుల్‌గాంధీ పార్టీకి కాబోయే నాయకుడిగా చలామణి అయ్యారు. కాంగ్రెస్ పార్టీ పదేండ్ల పాటు అధికారంలో ఉన్నప్పుడు సోనియా గాంధీ తెరవెనుక చక్రం తిప్పారు. ఈ దశలో కూడా రాహుల్ అధికార రాజకీయాలకు దగ్గరగానే ఉన్నారు. అయి నా రాహుల్‌గాంధీకి రాజనీతి ఒంటబట్టినట్టు లేదు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి స్వీకరించిన తర్వాత కూడా ఆయనలో మార్పు లేదు. ఈ ఎన్నికలలో సోనియా ప్రత్యక్ష పాత్ర ఏమీ లేదు. అంతా రాహుల్ నిర్ణయాల మేరకే జరిగింది. కానీ ఆయన ఎన్నికల సందర్భంగా వాస్తవిక దృష్టితో వ్యవహరించలేదు. అందువల్ల పార్టీ వైఫల్యాలకు ఆయన బాధ్యత వహించక తప్పదు. ఇటీవలి కాలంలో ఎన్నికల సందర్భంగా రాహుల్‌గాంధీ అనుసరించి వ్యూహం గమనిస్తే, ఆయ న బీజేపీతో నిజంగా పోరాడదలుచుకున్నారా అనే అనుమానం కలుగడం సహజం. ప్రచారంలో ప్రధాని మోదీపై విరుచుకుపడినప్పటికీ, కార్యాచరణలో మిత్రపక్షాలతో తలపడ్డారు. ఎన్నికల తం త్రం కూడా యుద్ధాన్ని పోలి ఉంటుంది. బీజేపీ మొదటి దశలో ప్రాంతీయ పక్షాలతో, తుది దశలో కాంగ్రెస్‌తో తలపడ్డది. మొదటి దశలో బీజేపీని నైతికంగా దెబ్బతీయడానికి ప్రాంతీయ పార్టీలను ప్రోత్సహిస్తే, తనవరకు వచ్చేవరకు మరింత బలహీనపడేది. కానీ తాను ప్రాంతీయ పార్టీలతో వైష మ్యం పెంచుకొని బీజేపీ బలాన్ని పెంచారు. దీనివల్ల మోదీ వైఫల్యాలను ప్రజలలో ఎండగట్టడంలో విఫలమయ్యారు. రైతులకు సంబంధించిన న్యాయ్ పథకాన్ని కూడా ప్రజలకు చేర్చలేకపోయారు. ఎన్నికలంటే ఏదో ఎదుటి పక్షాన్ని విమర్శించడం కాదు.

## పర్యావరణంపై విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు

విజయనగరం: కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం నిర్వహణలో జూన్ 3వ వ తేదీన స్థానిక జిల్లా గ్రంథాలయంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పునస్కరించుకుని విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వపోటీలు, చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నామని పర్యావరణం ఇంజినీరు టి.సుదర్శనం తెలిపారు. యెనెప్ ప్రకటన మేరకు ఈ ఏడాది గాలి కాలుష్యాన్ని తరిమికొట్టండి అనే అంశంపై ఈ పోటీల నిర్వహణ జరుగుతుందని తెలిపారు. జూన్ 3వ తేదీ ఉదయం 9గంటనుండి 10.30 వరకు జరగనున్న చిత్రలేఖనం పోటీల్లో జూనియర్ విభాగంలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు, సీనియర్ విభాగంలో 7 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు, పాల్గొనవచ్చని పేర్కొన్నారు. చిత్రలేఖనంకు కావలసిన అన్ని వస్తువులు తీసుకురావాలని కేవలం చార్టు పేపరు మాత్రమే ఇస్తామని తెలిపారు. అదేరోజు మధ్యాన్నం ఒంటిగంటకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ఉంటాయని అవిజూనియర్ విభాగంలో 6వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు, సీనియర్ విభాగంలో 7 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు, పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పోటీల్లో విజేతలకు జూన్ 5వ తేదీన జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్ససందర్భంగా జరిగే కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఇరత వివరాలకు 08922-227370, 9177303293, 9177303276 నెంబర్లకు సంప్రదిచ్చవచ్చని పేర్కొన్నారు. లేదా కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం సంప్రదించవచ్చని తెలిపారు.

## ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు

### విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్

విజయనగరం: జిల్లా కేంద్రంలో సోమవారం జిల్లా ఎస్పీ ఎ.ఆర్ .దామోదర్ నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల వేదికకు జిల్లా నలుమూలల నుండి 18 ఫిర్యాదులు వచ్చాయి. వాటిని పరిశీలించిన ఎస్పీ సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కార దిశగా సూచనలు జారీచేశారు. రామభద్రపురం మండలం చెందిన సూరమ్మ ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ కొంతమంది యువకులు తనతో అసభ్యకరంగా ప్రవర్తిస్తూ, వేధింపులుకు గురి చేస్తున్నారని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ ఫిర్యాదుపై విచారణ జరపాలని, వాస్తవాలను తనకు నివేదించాలని, చట్టపరమైన చర్యలు సుకోవాల్సిందిగా రామభద్రపురం ఎస్ఐను ఆదేశించారు. గంట్యాడ మండలం పెనసాం గ్రామానికి చెందిన సరస్వతి ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తనకు శ్రీనివాసరావు అనే వ్యక్తితో 2016లో వివాహం జరిగిందని, తన భర్త చెడు వ్యసనాలకు అలవాటు పడి, తనను, తన కుమార్తెను చూడడం లేదని, న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేసి, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా మహిళా పిఎస్ డిఎస్పీని ఆదేశించారు.జామి మండలం అలమండకు చెందిన అప్పలతల్లి ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తన చెల్లెలు వరలక్ష్మి చనిపోయిందని, ఆమె మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, దర్యాప్తు జరిపి, తన కుటుంబానికి న్యాయంచేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ పూర్తి స్థాయిలో విచారణ జరిపాలని, సాక్షులను విచారణ జరిపి దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా ఎస్. కోట సిఐను ఆదేశించారు.జామి మండలం అలమండకు చెందిన ఒకామెను అదే గ్రామానికి చెందిన అప్పారావు మరియు కొంత మంది అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు, వేధింపులకు గురి చేస్తున్నారని ఎస్పీగార్కి ఫిర్యాదు చేసి, న్యాయం చేయమనికోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన జిల్లా ఎస్పీ తక్షణమే విచారణ చేపట్టాలని, ఫిర్యాదు అంశాలు వాస్తవాలనినిర్ధారణ అయితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందిగా జామి ఎస్ఐను ఆదేశించారు.వేపాడ మండలం చినదుంగాడ గ్రామానికి చెందిన కిత్తన్న దొర ఎస్పీగార్కి ఫిర్యాదు చేస్తూ తనకు ఒక క్వారీకు అనుకొని భూమి కలదని, సదరు భూమిలోకి వెళ్ళేందుకు క్వారీ యజమానులు తమని అడ్డగిస్తున్నారని,న్యాయం చేయాల్సిందిగా కోరారు. ఈ ఫిర్యాదుపై స్పందించిన ఎస్పీ డాక్యుమెంట్లును పరిశీలించాలని, గ్రామ పెద్దలును విచారించాలని, రెవెన్యూ అధికారులు సహకారంతో సదరు భూమి ఎవరిదో గుర్తించాలని, ఫిర్యాదికి న్యాయం చేయాల్సిందిగా వల్లంపూడి ఎస్ఐను ఆదేశించారు.ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోనులో మాట్లాడి, వాటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, వాటి పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను తనకు వెంటనే నివేదించాలని ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం. నర్సింహారావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ సి.ఎం, నాయుడు, సిఐలురామకృష్ణ,ఎస్బీ ఎస్ఐ నీలకంఠం పాల్గొన్నారు.

## థాయ్ మాజీ ప్రధాని కన్నుమూత

బ్యాంకాక్: థాయ్‌లాండ్ మాజీ ప్రధాని జనరల్ ప్రేమ్ టిన్సులనోండా (98) కన్నుమూశారు. ఈ మేరకు రాజప్రాసాదం అధికారులు ఒక ప్రకటన విడుదల చేశారు. 1980 నుంచి 1988 మధ్యకాలంలో టిన్సులనోండా మూడుసార్లు ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. ప్రస్తుతం మహారాజు సలహాదారుల కమిటీలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు.

2016లో థాయ్‌లాండ్ రాజు భుమిబోల్ మృతి తర్వాత దేశ పరిపాలనలో కీలక భూమిక పోషించారు. తాజాగా ఇదే నెలలో జరిగిన భుమిబోల్ తన యుడు విజయాలంగ్‌కర్న్ పట్టాభిషేకం కార్యక్రమంలో ముఖ్య పాత్ర పోషించారు.

## మోదీ ప్రమాణ స్వీకారం.. కమల్‌కు ఆహ్వానం



న్యూఢిల్లీ : రెండో సారి ప్రధానిగా నరేంద్ర మోదీ ఈ నెల 30న ప్రమాణ స్వీకారం చేయనున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాటు పూర్తి కావొస్తున్నాయి.ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా పలువురికి మోదీ ఆహ్వానాలు పంపుతున్నారు. అందులో భాగంగా తాజాగా సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీ అధ్యక్షుడు కమల్‌హాసన్‌కు ఆహ్వానం పంపారు. తన ప్రమాణ స్వీకారానికి రావాల్సిందిగా మోదీ, కమల్‌ను ఆహ్వానించారు. మే 30న రాత్రి 7 గంటలకు రాష్ట్రపతిబ వన్‌లో మోదీ ప్రమాణం చేయనున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్.. మోదీతో ప్రమాణం చేయిస్తారు.నాథూరామ్ గాడ్సే మొట్టమొదటి హిందూ ఉగ్రవాది అని ఎన్నికల వేళ కమల్‌హాసన్ సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. దానిపై బీజేపీ నేతలు సర్వత్రా విమర్శలు కురిపించారు. ఈ నేపథ్యంలో తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కమల్‌ను మోదీ ఆహ్వానించడం విశేషం.

అయితే కమల్ ఈ ఆహ్వానంపై ఎలా స్పందిస్తారో వేచి చూడాలి. లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 352 సీట్లు గెలుచుకొని రికార్డు సృష్టించింది. బీజేపీయే సొంతంగా 303 స్థానాల్లో విజయం సాధించింది.

## సమకాలీనం / కవి సమయం

### డబ్బుతో మేలుంది

డిబ్బీలో డబ్బులు దాచుకో
అవసరాన్ని ఖర్చుకి వాడుకో;
నునపకాయ నుంచింది
మొలన సంగరించింది
పేరమ్మ పైసాలు;
బుంగలో పైసాలు దాచిపెట్టె పేరయ్య
అవసరానికి తీస్తాడు ఖర్చులకు తగినట్టు;
అగ్గొచ్చె, బుగొచ్చె చెప్పిరాదుగ
ఉప్పనైన, ఉదూతైన
ముందుగ యెవరికి తెలియరాదుగ;
పల్లెలైన, పట్నాలైన, రాష్ట్రలైన, దేశమైన
నిధులు పోగుపర్చాలి
అవసరానికుండాలి;
పైస, పైస, కూడగొట్టి
జాలె బాగ నింపొచ్చు;
పువ్వు, పువ్వు యేరికొచ్చి
పూల గుచ్చ కట్టొచ్చు;
చేతి యిసురు ఖర్చులు జోరుగ చేయొద్దు
అడ్డు, ఆపు మనలో - అదుపుంది;
తలకు మించి ఖర్చులు
తలబరువనిపిస్తుంది
జాగ్రత్తగ మెలగాలి
జీవితాన అడుగడుగున;
సోకులకు రిమ్మతెగులు పట్టొద్దు
డబ్బుంటే గుప్తంగ ఖర్చెట్టు;
దుబార ఖర్చులు మనిషికి తరిగించు
మన-వెనుక పేదలెందొరున్నారు
ధర్మానికి చేయూత యెంతో కొంత మనవంతు;
పరిమితి పరిధిలో ఖర్చులతో మెలగాలి
తలయిసురు డాబులతో పలకొద్దు;
పోకిరి ఖర్చులకు - ఇల్లంత గుళ్ళ చేయొద్దు.
దేశరక్షణకు - డబ్బును పంపించు యెంతో కొంత
దేశమనే భక్తిని చాటించు; యెంతో, యెంతో...

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు

## పంచాంగం

మాసం : వైశాఖ తిథి : నవమి ఉ.11.28;
పూర్వాభాద్ర సా.5.24; తె.వ.3.55ల 5.40.
మంగళవారం
28-05-2019

a మేషం : సుగంధ ద్రవ్య వ్యాపారస్తులకు కలిసి వచ్చేకాలం. గృహానికి సంబంధించిన వస్తువులు కొనుగోలు చేస్తారు. విదేశాలు వెళ్లటానికి చేయు యత్నాలు ఫలిస్తాయి. మార్కెట్ రంగాల వారికి నిరుద్యోగులకు సదవకాశాలు లభిస్తాయి. b వృషభం : రుణ యత్నాల్లో కొంత పురోగతి కనిపిస్తుంది. ఆర్థికంగా మంచి అభివృద్ధిని పొందుతారు. చిన్నతరహా పరిశ్రమలకు, చిరు వ్యాపారులకు అన్ని విధాల కలిసి రాగలదు. ప్రింటింగ్, స్టేషనరీ రంగంలోని వారికి పనిభారం పెరుగుతుంది. మీ సంతానం పై చదువుల విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు. c మిథునం : స్త్రీలతో సంభాషించేటప్పుడు సంయమనం పాటించండి. ఆడిటర్లు అసాధ్యమనుకున్న కేసులు సునాయాసంగా పరిష్కరిస్తారు. ఆత్మీయులకు విలువైన కానుకలు చదివించుకుంటారు.d కర్కాటకం : ఉద్యోగ వ్యాపారాల్లో పురోభివృద్ధి సాధిస్తారు. విధినిర్వణలో దొర్లిన తప్పిదాల వల్ల పత్రికా సంస్థలలో వారికి మనస్థిమితం అంతగా ఉండదు. . ప్రయాణాలు అనుకూలిస్తాయి. దైవ, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆలయాలు సందర్శి స్తారు. e సింహం : వస్త్రములు, విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. స్త్రీలు అనవసరం విషయాల్లో జోక్యం చేసుకోవడం వల్ల భంగపాటుకు గురవు తారు. కాంట్రాక్టర్లకు నూతన టెండర్ల విషయంలో పునరాలోచన అవసరం. fకన్య : ఉపాధ్యాయులక యాజమాన్యం ధోరణి నిరుత్సాహపరుస్తుంది. రవాణ, ఎదుమతులు, ట్రావెలింగ్ రంగాల వారికి ఆశాజనకం.వైద్యులకు పురోభివృద్ధి. ప్రముఖులను కలుసుకుంటారు.g తుల : స్త్రీలు ధనవ్యయం విషయంలో జాగ్రత్త వహించ వలసి ఉంటుంది. కొంత మంది మీతో స్నేహం నటిస్తూనే మిమ్ములను తప్పు దారి పట్టించేందుకు ప్రయత్నిస్తుంది.h వృశ్చికం : ఆర్థిక వ్యవహారాలు, నూతన పెట్టుబడులకు సంబంధించి స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. సంఘంలో ఆదర్శజీవనం గడుపుతారు. చేపట్టిన పనులు సకాలంలో సంతృప్తిగా పూర్తి చేస్తారు. i ధనుస్సు : నూతన పథకాలు, ప్రణాళికలు చేపడతారు. వస్త్ర, బంగారం, వెండి వ్యాపారస్తులకు పురోభివృద్ధి. .j మకరం : ప్రముఖులతో పరిచయాలు మీ ఉన్నతికి నాంది పలుకుతాయి. దూరంగా ఉండటం మంచిది.. k కుంభం : ఇతరులు మీ నుంచి సమాచారం రాబట్టేం దుకు ప్రయకత్నిస్తారు. వ్యాపారాలు, ఉపాధి పథకాల్లో నిలదొక్కుకోవటానికి బాగా శ్రమించవలసి ఉంటుంది. L మీనం : రవాణా కార్యక్రమాలలో చురు కుగా పాల్గొంటారు. వాహనం కొనుగోలుకై చేయు ప్రయత్నాలు ఫలిస్తాయి.

## ఈ కోనేటి తీర్థాన్ని స్వీకరిస్తే చాలు..




భగవంతుడి అనుగ్రహంతో అక్కడ ఆవిర్భవించిన తీర్థాలు మహిమాన్వితమైనవిగా చెప్పబడుతుంటాయి. అలాంటి క్షేత్రాలలో ఒకటిగా 'శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి' క్షేత్రం కనిపిస్తుంది. నల్గొండ జిల్లా నార్కెట్ పల్లి మండ లం 'గోపాలపల్లి' గ్రామంలో గల కొండపై ఈ స్వామి కొలువై వున్నాడు. స్వామివారి పేరుమీదనే ఈ గ్రామానికి ఈ పేరు వచ్చిందని అంటారు.

నల్గొండ జిల్లాలో గల ప్రాచీనమైన క్షేత్రాలలో ఈ వేణుగోపాల స్వామి ఆలయం ముందువరుసలో కనిపిస్తుంది. స్వామివారు స్వయంభువుగా ఆవిర్భవించడం వలన, ఈ క్షేత్రం ఎంతో విశిష్టమైనదనీ .. మరెంతో మహిమాన్వితమైనదని చెబుతుంటారు. పూర్వం ఎంతోమంది మునులు ఈ కొండపై స్వామివారిని సేవిస్తూ ఉండేవారని అంటారు.

ఇక్కడ కనిపించే 'మంత్ర బావి'ని గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటారు. స్వామివారి పాద స్పర్శతో ఇక్కడ జలం ఉబికి వచ్చి కోనేరుగా మారిందని అంటారు. ఈ కోనేరునే 'మంత్ర బావి' అని పిలుస్తుంటారు. వివిధ రకాల అనారోగ్యాలతో బాధపడేవాళ్లు ఈ కోనేటిలోని నీటిని స్వీకరిస్తుంటారు. స్వామివారి పాద తీర్థం కనుక, వెంటనే ఫలితం కనిపిస్తుందని విశ్వసిస్తుంటారు. మంత్రం వేసినట్టుగా ఫలితాన్ని చూపుతుంది కనుక, ఈ కోనేరును 'మంత్ర బావి'గా చెప్పుకుంటూ వుంటారు. రామలింగేశ్వరుడితో కలిసి వేణుగోపాలుడు పూజాభిషేకాలు అందుకునే ఈ క్షేత్రాన్ని చూసితీరవలసిందే.

## సంకీర్తన

### లక్ష్మీదేవి నామస్మరణ ఫలితం



జీవితంలో ప్రతి ఒక్కరూ ఒక్కో మెట్టూ ఎక్కుతూ అభివృద్ధిని సాధించాలని అనుకుంటారు. అందుకు అవసరమైన ప్రయత్నాలను కొన సాగిస్తూనే వుంటారు. ఎవరికైనా సరే అవసరాలు తీరాలన్నా .. అభివృద్ధిని సాధించాలని వున్నా అందుకు ఆర్థికపరమైన స్థిరత్వం ఎంతో అవసరం. ఆర్థికంగా బలంగా .. స్థిరంగా ఉన్నప్పుడే, ఏ పని చేయడానికైనా కావలిసిన ధైర్యం .. ఉత్సాహం కలుగుతుంటాయి.

లేదంటే ఆశయాన్ని సాధించే అవకాశం లేక నిరాశకి లోనుకావలసి వుంటుంది.

ఇలాంటి పరిస్థితుల్లో నుంచి బయట పడటానికి లక్ష్మీదేవి అనుగ్రహం అవసరమవుతుంది. అందుకే అంతా ఆ తల్లిని పూజిస్తుంటారు .. భక్తి శ్రద్ధలతో సేవిస్తుంటారు. లక్ష్మీదేవి కరుణా కటాక్షాల కోసం .. అంతా ఆమెకి ఇష్టమైన విధంగా పవిత్రమైన జీవితాన్ని గడపడానికి సిద్ధపడుతుంటారు. ప్రతి శుక్రవారం పూజా మందిరంలోని అమ్మవారిని పూజించడమే కాకుండా, అమ్మవారి ఆలయాలను దర్శిస్తుంటారు.

అయితే పూజా సమయంలో మాత్రమే కాకుండా, అనునిత్యం ఆ తల్లి నామాన్ని స్మరించడం వలన కూడా విశేషమైన ఫలితాలు కలుగుతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. తన నామాన్ని సదా ఎవరైతే స్మరిస్తూ ఉంటారో, వాళ్ల వెన్నంటే తాను ఉంటానని అమ్మవారే సెలవిచ్చినట్టుగా ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. అమ్మవారి నామాన్ని భక్తి శ్రద్ధలతో ఎవరైతే సదా స్మరిస్తూ వుంటారో, వారి మనోభీష్టాలు నెరవేరడానికి అవసరమైన అవకాశాలను అమ్మవారు కల్పిస్తుందని చెప్పబడుతోంది. అమ్మవారి ప్రీతిని పొందితే .. ఆ తల్లి ఆ ఇంట స్థిరంగా వుండిపోతుందని స్పష్టం చేయబడుతోంది.




# నేటినుంచి క్రికెట్ పోటీలు

యానాం : పుదుచ్చేరి ఆరోగ్యశాఖామంత్రి మల్లాడి కృష్ణారావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 28 నుంచి క్రికెట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కమిడి దత్తు ప్రసాద్, పాతుల జయదేవ్, పంతగడ సుమన్‌బాబు, హరి, శ్యామసుధీర్, మురళీలు తెలిపారు. స్థానిక మిట్టకురు హైస్కూల్ క్రీడా మైదానంలో ట్రోఫీ వెయిట్ టెన్నిస్ శాకౌట్ క్రికెట్ టోర్నమెంట్ 4వసారి నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే జట్లు ఫీజు రూ.400లు కట్టాలన్నారు. ప్రతిరోజు నాలుగు మ్యాచ్‌లు ఈ టోర్నమెంట్ నాకౌట్‌లో నిర్వహిస్తామన్నారు. ప్రతి మ్యాచ్ 10 ఓవర్‌లలో జరుగుతాయన్నారు. ఈ పోటీలు ఉదయం 8 గంటల నుండి జరుగుతాయన్నారు. ఒక మ్యాచ్‌లో ఆడిన వ్యక్తి మరో మ్యాచ్‌లో ఆడరాదన్నారు. ఈ పోటీలను దాతల సహకారంతో నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని కోరారు.

# నదిలోకి దూకి రోగి ఆత్మహత్య

యానాం : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మెట్టకూరు గ్రామానికి చెందిన మల్లిపూడి శ్రీనివాస్(45) ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్ళి కొరంగి నదిపాయలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. తరచూ అనారోగ్యానికి గురి అవుతుండడంతో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మృతుడు ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్ళి కనిపించకుండా పోయాడు. రోగి దగ్గర తల్లి వుండటం ఆమెను సిబ్బంది వెళ్ళిపొమ్మనడంతో ఎవరూ లేని సమయం చూసి ఈ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వలనే రోగి మనస్థాపానికి గురి అయి వుంటాడని బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. సిబ్బంది డ్యూటీలో వున్నవారు పట్టించుకోకపోవడంతో, సరైన వైద్యం ఇవ్వడం లేదని బాధతో ఆత్మహత్యకు పాల్పడి వుంటారని దీనిపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు. ఆసుపత్రి పరిస్థితిని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని బంధువులు డిమాండ్ చేశారు.

## రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో పతకాల పంట

శ్రీకాకుళం : విశాఖపట్నం జిల్లా పోర్ట్ స్టేడియంలో నిర్వహించిన 3వ రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ పోటీలలో జిల్లాకు చెందిన క్రీడాకారులు పతకాల పంట పండించారు. ఈ నెల 24, 25 తేదీలలో జరిగిన ఈ పోటీలలో జిల్లా జట్టు ఒక బంగారు పతకం సహా రెండు రజత, 3 కాంస్య పతకాలు కైవసం చేసుకుని ఓవరాల్ రన్నరప్‌గా నిలిచింది. ఎం.రాంబాబు 52 కిలోల విభాగంలో రజత పతకం, టి.రఘురాం 56 కిలోల విభాగం కాంస్య పతకం, ఎస్.యేసు 60 కిలోల విభాగంలో బంగారు పతకం, వై.సూర్య నారాయణ 64 కిలోల విభాగంలో కాంస్య పతకం, ఎన్.భీమ్ 69 కిలోల విభాగంలో కాంస్య పతకం, ఎస్.కుమార్ 75 కిలోల విభాగంలో రజత పతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులను లక్ష్మణదేవ్ తదితరులు అభినందించారు.

### ప్రశాంతంగా

# గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష

భీమునిపట్నం : ఏ.పీ.పీఎస్.సి నిర్వహించిన గ్రూప్-1 స్క్రీనింగ్ పరీక్ష, నియజకవర్గంలోని 16 కేంద్రాల్లో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. తగరపువలసలోని చిట్టివలస జెడ్పి ఉన్నత పాఠశాలలో 240 మందికి గాను 135 మంది, తగరపువలస శ్రీ క ృష్ణా కళా శాలలో 288 మందికి గాను 142 మంది, దాకమర్రిలో చిట్ కళా శాలలో 432 మందికి గాను 183 మంది పరీక్ష రాసారు. ఉదయం 10 గం ల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్-1 , 2 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరిగాయి. పరీక్షలకు గాను పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

### వైభవంగా శ్రీ శయన

# వివాహ పరిచయ వేదిక

విశాఖపట్నం : వివాహ పరిచయ వేదికలు సామాజిక వర్గాల మధ్య సత్సంబంధాలు పెంచేందుకు దోహదపడతాయని విజయ నగరం జిల్లా అదనపు జడ్జి ఎ.వరప్రసాదరావు అన్నారు. సూపర్ బజార్ సమీపంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో శ్రీ శయన సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా కోల్‌కత్తా నుంచి పలువురు వేదికకు హాజరయ్యారు. కార్యక్రమానికి అదనపు జడ్జి వరప్రసాదరావు ముఖ్య అతిధిగా హాజరై నిర్వాహ కులను అభినందించారు. భాజపా నాయకురాలు కె.రాజకుమారి, సంఘం అధ్యక్షుడు తోట వాసుదేవరావు, రామాంజనేయులు, కళా రవి తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాసేవ చేయడానికి వచ్చా

# ఎవరినో ఓడించడానికి రాలేదు

### యలమంచిలి జనసేన నాయకులు సుందరపు



అచ్యుతాపురం : ప్రజాసేవ చేయడానికి వచ్చానని ఎవరినో ఓడించడానికి రాలేదని యలమంచిలి జనసేన నాయకులు సుందరపు విజయకుమార్ అన్నారు .స్థానిక పార్టీ కార్యలయంలో విలేకరుల తో మాట్లాడారు. గెలుపు, ఓటములు సహజమని ఓడిన ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు .పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలను ,ఆశయాలను ప్రజలలోకి తీసుకెళ్లడానికి క ృషి చేసి తన వెంట నడిచిన జనసైనికులకు రుణపడి ఉంటానన్నారు .ఆశయంతో వచ్చానని ఆశతో రాలేదన్నారు .ఈవీఎం లపై అనుమానాలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పైల రామ ఎనాయుడు ,లవుడు లోవరాజు ,బొద్దపు శ్రీను ,అన్నం బాబ్జి జనసైనికులు ఉన్నారు.

# చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

మధురవాడ : మహా విశాఖ చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలొ 2001-2002 సంవత్సరం టెన్త్‌క్లాస్ బ్యాచ్ కు చెందిన పూర్వపు విద్యార్థులు ఆత్మీయ కలయిక సోమవారం కొమ్మాది లో ఉన్న సూర్య ఫంక్షన్ హాల్ నందు జరిగింది. పదహారేళ్ల అనంతరం పూర్వపు విద్యార్థులు ఉపాధ్యాయులు ఒకే వేదికపై కలవడంతో తమజ్ఞాపకాలని గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆనాటి ప్రధానొపాధ్యాయులు గోవింద రావు మాట్లాడుతూ 2001-2002 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు మాకు చాలా ప్రత్యేకమైన వారని, వీరితో మాకు ఎనలేని బంధం కలిగి ఉందని అన్నారు, ఆనాటి జ్ఞాపకాలను సంఘటనలను గుర్తు చేస్తూ పూర్వ విద్యార్థులతో ఆనందంగా గడిపారు. అనంతరం విద్యార్థులందరూ కలిసి ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి మెమొంటోలని అందించి ఘనంగా సత్కరించారు, అనంతరం సమావేశంలో పూర్వపు విద్యార్థి పోలి మాటి సునీల్ కుమార్ మాట్లాడుతూ 2001-2002 బ్యాచ్ కు సంబంధించిన విద్యార్థుల కలయకతో పూర్వపు జ్ఞాపకాలు, అనుభవాలు, పంచుకోవడం ఆనందంగా ఉందని అన్నారు, ఈ కలయికతో మరొక అడుగు ముందుకు వేసి మేమందరం కలసి ఒక కమిటీ ఏర్పాటు చేయటం జరిగిందని తెలిపారు, ఈ కమిటీ ద్వారా మాలో ఉన్న వారి వారి ఆర్థిక పరిస్థితి తో పాటు ఇతర ఎటువంటి ఇబ్బందులను కలిగి ఉన్నవారికి మా వంతు సహకారం అందించేందుకు కమిటీ ఏర్పాటు చేయటం జరిగిందని, ఈ సమావేశానికి నాలుగు రోజుల ముందర కమిటీ ద్వారా మాలో ఒక పూర్వపు విద్యార్థినికుమారుడకు ఆపరేషన్ నిమిత్తం 13 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించడం జరిగిందని సునీల్ తెలియపరిచారు, అదేవిధంగా భవిష్యత్ కార్యాచరణ రూపొందించి ఎటువంటి అవసరానికైనా మా కమిటీ నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పూర్వ విద్యార్థుల కమిటీ చేస్తున్న సంక్షేమ కార్య క్రమాలను అభినందిస్తూ తమ వంతు సాయంగా ఉపాధ్యాయులు అందరూ కలిసి ఎనిమిది వేల రూపాయలు కమిటీకి సహాయంగా అందిస్తున్నట్లు సునీల్ తెలిపారు, ఈ కార్యక్రమంలో త్రివేణి, కొర్రాయి సురేష్, సంతోష్, బంగారు బాబు,రాజేష్, హరిక ృష్ణ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలు తొలిగింపు





మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డ్ పరిధి సర్వే నెం.126/4 లో రెండెకరాల 30 సెంట్ల వి ఎంఆర్ డిఏ స్థలంలో వేసిన పాకలను అధికారులు తొలిగించారు , గతంలో రెండుసార్లు రెవిన్యూ ఉడా అధికారులు ఆక్రమణలను తొలిగించినప్పటికీ మళ్ళీ వారు ఆక్రమించుకొని పాకలు వేశారు. దింతో వుడా అధికారిని టీ. సరోజినీ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తుతో ఆక్రమణలు తొలిగించారు. అనంతరం సిబ్బంది హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగ వుడా అధికారిని సరోజ మాట్లాడుతూ ఎంఆర్ డి ఏకు చెందిన స్థలాన్ని కబ్జా చేసి అక్కడ నివసిస్తున్న 19 మందిని పోలీసులు అరెస్టు చేసారు అని చెప్పారు ఇకపై స్థలం ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టి కమ్యూనిటీ గార్డను ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే మధురవాడలోని పలు ప్రాంతాలలో వుడా స్థలాలు కబ్జాకు గురైనట్టు తన దృష్టికి వచ్చింది అన్నారు. వాటన్నిటిపై సమగ్ర విచారణ జరిపి ఆక్రమణ దారుల పై చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమములో ఏసీపీ ప్రవీణ్ కుమార్, సిఐలు సూర్యనారాయణ, శ్రీనివాసరావు, శంకర్రావు,సిబ్బందితో పాటు రెవిన్యూ అధికారులు పాల్గొన్నాఉ.

# భీమిలీని నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా : అవంతీ



భీమునిపట్నం : భీమిలీ నియోజకవర్గ ప్రజలు నన్ను అత్యధిక మెజారిటీతో గెలిపించారని వారికి నేనెప్పుడూ ఋణపడి ఉంటానని భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ముత్తం శెట్టి శ్రీనివాసరావు విజయానికి అభినందిస్తూ ఆనందపురం మండల వైస్సార్ సీపీ పార్టీ శ్రేణులు అవంతిని పూలమాలలతో సత్క రించి వారి అభిమానాన్ని చాటు కున్నారు. ఈ సందర్భంగా అవంతి శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమిలిని అభివృద్ధి పథంలో ముందుంచి నెంబర్ వన్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని అన్నారు. తన గెలుపుకు పార్టీ శ్రేణులు ఏ విధముగా కష్టపడ్డారో అదేవిదంగా స్థానిక సమస్యలపై కష్ట పడా లని సూచించారు. అలాగే ఆనందపురం మండలం పార్టీ శ్రేణు లకు కార్యకర్తలకు తన కృతజ్ఞతలు తెలియజేసారు.

# కేజిబివిలో ప్రవేశానికి ప్రైవేటు విద్యార్థులు అర్హులే

కోటవురట్ల : కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కేజిబివి ప్రత్యేకాధికారి వెంకటతులసి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు మాత్రమే ఇప్పటి వరకు కేజిబివిలో ప్రవేశం ఉండేదని, కొత్తగా వచ్చిన ఆదేశాల ప్రకారం ప్రైవేటు స్కూళ్లలో చదివిన విద్యార్థులు కూడా అర్హులని పేర్కొన్నారు. వారూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. తల్లి లేదా తండ్రి ఎవరో ఒకరు మాత్రమే ఉన్న పిల్లలు, బడి బయట పిల్లలు, పేదరికంతో ఉన్న పిల్లలు అర్హులుగా పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

# గణబాబుకు అభినందనలు తెలుపుతున్న డ్వాక్రా మహిళలు



ములగాడ : పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న డోక్రా మహిళలు ఆర్పీలు సి ఓ లు అందరూ కలిసి పశ్చిమ నియోజకవర్గంలో మరల తెలుగుదేశం పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబుమళ్లీ అత్యధిక మెజార్టీతో అఖండ విజయం సాధించిన సందర్భంగా గణబాబు స్వగృహమునందు ఆయనకు పుష్ప గుచ్ఛాలు ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు ఎప్పుడు పార్టీ యొక్క సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని ఆయన హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు మరియు సి ఓ కొండమ్మ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నీలపు జోగిబాబు తదితరులు పాల్గొన్నారు.


# హెచ్‌పిసిఎల్ అధికారులకు స్ఫూర్తి టీం అభినందనలు



ములగాడ: హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ అధికారులు మల్కాపురం 49 వార్డుల్లో సోమవారం సందర్శించారు ఇందులో భాగంగా హెచ్పీసీఎల్ యాజమాన్యం పారిశ్రామిక ప్రాంతంలో ఇప్పటి వరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు సేవా కార్యక్రమాలు ప్రజలకు అందిస్తున్నారని దీనిని ద ృష్టిలో పెట్టుకుని ప్రకాష్ నగర్ స్ఫూర్తి టీం వెల్ఫేర్అసోసియేషన్ అధ్యక్షులు అప్పన్న కార్యదర్శి సోమాలు అధికారులను అభినందిస్తూ వారికి జ్ఞాపికలు అందించి సత్కరించారు ఈ కార్యక్రమంలో హెచ్ పీసీఎల్ అధికారులు డీజీఎం కే అప్పారావు బియన్ రావు పిఆర్‌ఓ శర్మ హెచ్ ఆర్ మేనేజర్ కాళీ రఘురాం మిలన్ నాగ్ చీఫ్ మేనేజర్ సుధా జాన్ తెరియన్ మరియు స్ఫూర్తి టీం సభ్యులు పాల్గొన్నారు

# అంగన్‌వాడీ కేంద్రాలకు తక్షణమే పాల సరఫరా పునరుద్ధరించండి

### ఛైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డా.గొండు శీతారాం డిమాండ్



విశాఖపట్నం : పిల్లల్లో బరువు, ఎదుగుదల సమస్యలతో పాటు, గర్భిణీల్లో హిమోగ్లోబిన్ లోపాన్ని తగ్గించాలనే సదుద్దేశ్యంతో అంగన్‌వాడీ కేంద్రాలకు పాలను సరఫరా చేస్తున్నారు. కాని గత పదిరోజులుగా విశాఖపట్నంలో ఈ పాల సరఫరా నిల్చిపోవడంతో మెయిన్ సెంటర్లు 1364 మినీ సెంటర్లులలో, చిన్నారులు 1,78,031, బాలింతలు 21,994, గర్భిణీలు 21,984 మంది ఎన్నో అవస్థలు ఎదుర్కొం టుండం విచారకరమని ఛైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు శీతారాం డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించిన వారిలో ఫోరం మహిళా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి.శకుంతల, జి.సత్యవతి, తిర్లంగి హరి, జె.వి.కుమార్, ఎల్లయ్య, పి.శేఖర్, బిఎల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### బాల కార్మికులను గుర్తించేందుకు వెళ్లిన

# ఐసిడిఎస్ అధికారులకు చేదు అనుభవం

### చోట నాయకులు, డమ్మీ డబ్బా రాయుళ్ల అండతో రెచ్చిపోయిన ఇటుక బట్టి యాజమాని, అనుచరులు



ఎంఇఒ, సిడిపిఒలతో బట్టిలోని పిల్లలు

నర్సీపట్నం : జిల్లా కలెక్టర్ పంపారు.. ఇటుక బట్టిల్లో బాల కార్మికులను గుర్తిచేందుకు వచ్చాం అన్న అధికారులపై బట్టీ యాజమాని మోహన్‌తో పాటు తన దగ్గర పని చేసే తన మోచేతి నీళ్లు తాగే అనుచరులు, డమ్మీ డబ్బారాయుళ్ల అండతో రెచ్చి పోయాడు. అధికారులను భయభ్రాంతులకు గురి చేశాడు. ఒక దశలో బెదిరించినంత పని చేశాడు. ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కల్పించారు.

ఐసిడిఎస్ అధికారులు పాకల్లోకి వెళ్లి చూసి చిన్నారుల హీన పరిస్థితిని చూసి అవాకయ్యారు. బట్టీ యాజమాని, అనుచరులు కేకలు వాస్తవ పరిస్థితులు చూసి మూగబోయాయి. సిడిపిఒ ఎం.శ్రీకళ అక్కడ మహిళలకు పోషకాహారం పంపిణీ చేశారు. చేసేదేమి లేక నేనేం పిల్లల్ని మీకు అప్పగిస్తాను, వారికి పుడ్ ప్రొవైడ్ చేస్తారా అని బట్టీ యాజమాని మోహన్ ఒప్పుకున్నాడు. మీరెందుకు అప్పజెప్తారు..అది మీ పని కాదు అని జ్ఞానహీనమైన మాటలు పలికి తన అనుచరులు తమ మూర్ఖత్వాన్ని మరో మారు వెళ్లగక్కారు. ఇదంతా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కొందరు తలంటెనట్లు సమాచారం. ఇకనైనా ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు స్థానిక ఆర్డీవో, ఏఎస్పీ కలుగజేసుకోకపోతే అధికారులకు ప్రాణభయం తప్పదని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

## ఎమ్మెల్యే పర్వత కు అన్నవరం దేవస్థానం వేదపండితుల ఆశీర్వాదములు



అన్నవరం: తూ.గో.జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే పర్వత.పూర్ణచంద్ర ప్రసాద్ కు అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం వేదపండితులు,దేవస్థానం పిఆర్వో తులా.రాముడు మర్యాద పూర్వకముగా కలసి వేద ఆశీస్సులు అందజేసి శ్రీ స్వామివారి ప్రసాదమును అందజేశారు.

## ప్రజావాణిలో విన్నవించుకున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి

సింధియా: జోన్-4లో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు విన్నవించుకున్న సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు జోన్-4జెడ్సీ రమణమూర్తి తెలిపారు. సోమవారం జ్ఞానాపురంలో జోన్-4కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ముఖ్యంగా నీటికోసం ప్రజలు ఎక్కువగా సమస్యలు తెలిపారని వాటిని పరిష్కరించేందుకు కృషిచేస్తానని అన్నారు. ఇంజనీరింగ్, యుజిడి, ఇఇడబ్ల్యూలలో విభాగాలనుంచి ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాలంటూ ప్రజల నుంచి వినతులు అందాయని తెలిపారు. సత్వర పరిష్కారానికి కృషిచేస్తానని, జోన్-4లో ఎటువంటి ప్రజాసమస్యలున్న తమదృష్టికి తేవాలని ఆయన కోరారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కైలాసగిరిలో స్వచ్ఛభారత్



విశాఖపట్నం: రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విశాఖ పోర్టు సిటీ నుంచి 5 సభ్యులు అధ్యక్షులు వై.శ్రీనివాస కుమార్, కార్యదర్శి కె.నగేష్ కుమార్, జాయింట్ కార్యదర్శి హిమకర్ టాటా మరియు డైరెక్టర్ కాళీ ప్రసాద్, చిన్నారావు, స్వచ్ఛభారత కార్యక్రమము కైలాసగిరి కొండపైన నిర్వహించారు. సుమారు 300 మద్యం సీసాలు, 17 సంచుల ద్వారా సేకరించి వారి సొంత వాహనంలో రావాణా చేసారు. పర్యాటక ప్రదేశం అయిన కైలాసగిరి కొండపై అసాంఘిక కార్యక్రమాల వలన మన విశాఖ నగర ప్రతిష్ట దిగజారే విధంగా పర్యాటకులు ప్రవర్తించడంపైన ఆందోళన వెలిబుచ్చారు. దీనిపై వుడా అధికారులు తగిన చర్యలు తీసుకోవలసిందిగా కోరుచున్నారు.

## పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా...



విశాఖ సిటీః ప్రముఖ సంఘ సేవకులు, వైద్యులు డాక్టర్ సీఎం ఏ జహీర్ అహ్మద్ సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు దక్షిణ నియోజకవర్గం, 23 వ వార్డు రంగీరీజు వీధి, సున్నపువీధికి చెందిన నిరుపేద మహిళలకు ఆయన చీరలు పంపిణీ చేశారు. సుమారు 2 వందల మంది పేద మహిళలకు ఈ చీరలను అందజేశారు. ఆయన ప్రతి ఏడాది రంజాన్ మాసంలో విశాఖ నగరంలో అనేక ప్రాంతాల్లో విరివిగా సేవా కార్యక్రమాలు చేపడతారు. నిరుపేదలకు వస్త్రాలతో పాటు బియ్యం, నిత్యావసరాలు అందిస్తుంటారు. కొంతమందికి ధన సహాయం చేస్తారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు సాయం అందించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సంపాదనలో కొంత బాగాన్నీ నిరుపేదల కోసం ఖర్చు చేస్తానని వెల్లడించారు.

స ృష్టిలో ప్రతి ఒక్కరు సంతోషంగా ఉండాలన్నదే తన అభిమతమని పేర్కొన్నారు.ఈ రంజాన్ మాసంలో మరికొన్ని ప్రాంతాల్లో.. సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. నిరుపేదలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## వైభవంగా శ్రీశ్రీశ్రీ విజయదుర్గ అమ్మవారి పండుగ



గాజువాక: జీవీయంసీ 50వ వార్డు బాపూజీకాలనీలో వెలసిన శ్రీశ్రీశ్రీ విజయదుర్గ అమ్మవారి పండుగ వైభవంగా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఉత్సవం సంధర్భంగా అమ్మవారికి కుంకుమ,ప్రత్యేక పూజలను వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంత భక్తులు అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయకమిటీ ఆద్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవానికి గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి తనయుడు తిప్పల వంశీరెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దైవచింతన ఉండాలని అన్నారు. ఇంత పెద్దఎత్తున ఉత్సవం జరిపించిన ఆలయ కమిటీ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. అలాగే గాజువాక ప్రజలు తన తండ్రిన ఎమ్మెల్యేగా గెలిపించినందుకు కృతజ్ఞతలను తెలిపారు. గ్రామానికి, ఆలయానికి సంబందించిన ఎటువంటి సమస్యనైన పరిష్కరించేందుకు తమ వంతు సహాయసహకారాలను అందివ్వనున్నట్లు తెలిపారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన రేలారే...రేలారే. నృత్యంతోపాటు పలు కార్యక్రమాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ ప్రతినిధి నగిశెట్టి శ్రీను, వైకాపా నేతలు తుంపాల తాతారావు, పిట్లారెడ్డి, సన్యాసినాయుడు, జాగారపు అర్జున్, రమేష్, మంగునాయుడు, రట్టివాసు, సుబ్రమణ్యం వెంకట సూరిబాబు, శ్రీనివాసరావు, అప్పారావు, పికే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుని సన్నిధిలో జూలై 1 నుండి భక్తులకు డ్రెస్ కోడ్





అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధిలో నూతన విధానానికి ఆలయ ఈవో ఎం.వి.సురేష్ బాబు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులు సౌలభ్యం దృష్ట్యా కొన్ని కీలక నిర్ణయాలు చర్చించామని. భక్తులు రూమ్ తీసుకోన్నాప్పుడు సిఆర్ఓ ఆఫీసు నందు దరఖాస్తు పూర్తి చేసి,ఆధార్ కార్డు జతపరిచి, బయోమెట్రిక్ ద్వారా రూమ్ తీసుకోవాలని,ఖాళీ చేసేటప్పుడు కూడా బయోమెట్రిక్ ద్వారా ఖాళీ చేయాలని అలాగే కార్తీకమాసంలోని రద్దీ సమయంలో రూము తీసుకొన్న సమయం నుండి 12 గంటలు మత్రమే భక్తులకు రూమ్ కేటాయించడం జరుగుతుంది అని అన్నారు.అదేవిధంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ నిభంధనలకు అనుకూలంగా జూలై 1వ తేదీ నుండి శ్రీ స్వామివారి వ్రతములు దర్శనం కొరకు వచ్చే భక్తులు తప్పనిసరిగా హిందూ సాంప్రదాయ దుస్తులు పురుషులు పంచె,కండువా, కుర్తా పైజామా,స్త్రీలు చీర, జాకెట్టు,పంజాబిడ్రెస్,చున్నితో కూడిన డ్రెస్ కోడ్ ను భక్తులు తప్పనిసరిగా ధరించే శ్రీ స్వామివారి దర్శనం,వ్రతం మరియు ఇతర సేవలలో పాల్గొనాలని తెలిపారు.సాంప్రదాయ దుస్తులు ధరించని వారిని ఎట్టి పరిస్థితులలోనూ స్వామివారి సేవలలో గాని,దర్శనానికి గాని అనుమతించేది లేదని తెలిపారు.అదేవిధంగా స్వామివారి దర్శనానికి వెళ్లేటప్పుడు సెల్ ఫోన్లు,లగేజీ లను అనుమతించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసి ఈరంకి.జగన్నాధరావు,పిఆర్వో తులా.రాముడు, ఏఈవోలు ప్రసాద్, బండారు.సత్యవతీ దేవి,బ్రమరాంబ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో సంక్షేమ పాలన సాకారం అవుతోంది

### ఏయూలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు



విశాఖపట్నం: రాష్ట్రంలో సంక్షేమ పాలన సాకారం అవుతుందని ఏయూ ఆచార్యులు, ఉద్యోగులు అన్నారు. సోమవారం సాయంత్రం ఏయూలోని వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రేస్ పార్టీ విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ పజ్రలకు అవసరమైన సంపూర్ణ సంక్షేమ పాలనను వై.ఎస్ జగన్ మోహన రెడ్డి అందిస్తారన్నారు. వై.ఎస్ రాజశేఖర రెడ్డి పాలనను తలపిస్తూ అంతకంటే అధికంగా సంక్షేమ ఫలాలను అందించే దిశగా కృషిచేస్తారన్నారు. ఏయూ హెచ్ఆర్ఎం విభాగాధిపతి ఆచార్య కె.జాన్ మాట్లాడుతూ విద్యార్ధులకు, ప్రజలకు ఉపయుక్తమైన సంక్షేమ పతకానలు సమర్ధవంతంగా నిర్వహిస్తూ ప్రజా రంజక పాలన అందించాలన్నారు. వైఎస్ఆర్ఎస్‌యూ విశాఖ పార్లమెంట్ అద్యక్షుడు బి.కాంతారావు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడుకు ఆంధ్రరాష్ట్ర ప్రజలు తగిన గుణపాఠం చెప్పారన్నారు. విశ్వసనీయత కలిగిన నాయకత్వానికి ప్రజలు పట్టం కట్టారన్నారు.

వైఎస్ఆర్ఎస్‌యూ ఏయూ ఇంచార్జి బి.మోహన బాబు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసారని, నేడు ఆయనకు కేవలం 23 మంది ఎమ్మెల్యేలే మిగిలారన్నారు.

కార్యక్రమంలో వైఎస్ఆర్ఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఎం.కళ్యాణ్, విద్యార్థి నాయకులు, కె.సుధీర్ పాల్, మణి, కుమార్, దేవానందం, రమణ, ఉద్యోగ సంఘాల నాయకులు లక్ష్మణ రెడ్డి, మొల్లి అప్పలరాజు, రమణా రెడ్డి, సాగర్ పెద్దసంఖ్యలో విద్యార్ధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## హెచ్‌పిసియల్ యాజమాన్యానికి అభినందనలు తెలిపిన స్ఫూర్తీ టీం



సింధియా: పారిశ్రామిక ప్రాంతంలో ప్రజలకోసం హెచ్‌పిసియల్ (విశాఖ రిఫైనరీ) సంస్థ చేస్తున్న సేవలను మరువలేమని మల్కాపురం స్ఫూర్తీ వెల్ఫేర్ అసోషియోషన్ ప్రతినిధులు పేర్కోన్నారు. సోమవారం సియస్ఆర్ కార్యక్రమంలో భాగంగా మల్కాపురం, ప్రకాష్‌నగర్ ప్రాంతాలను సందర్శించేందుకు హెచ్‌పిసియల్ యాజమాన్యం విచ్చేసింది. ఈ సంధర్భంగా స్ఫూర్తీ వెల్ఫేర్ అసోషియోషన్ ప్రతినిధులు హెచ్‌పిసియల్ యాజమాన్యం చేస్తున్న సేవలను కొనియాడుతూ వారిని ఘనంగా సత్కరించి, వారికి మెమేంటోను ప్రధానం చేసారు. ఈ సంధర్భంగా స్ఫూర్తీ టీం ప్రతినిధులు మాట్లాడుతూ అన్ని వర్గాల అభివృద్ధి,సంక్షేమం కోసం సియస్ఆర్ కార్యక్రమంలో భాగంగా నిధులు వెచ్చించి, హెచ్‌పిసియల్ యాజమాన్యం చేస్తున్న కార్యక్రమాలను పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఎప్పటికీ మరువలేరని, విద్య,వైద్యం, మంచినీటి సౌకర్యంతో పాటు పలువురికి నగదు పారీతోషకం ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ముఖ్యంగా పి.ఆర్.ఓ (హెర్ సీనియర్ మేనేజర్)యు.ఎస్.ఎస్.శర్మ సేవలను మరువలేమని, ఆయనకు ప్రత్యేక అభినందనలు, కృతజ్ఞతలను తెలిపారు. ఈకార్యక్రమంలో హెచ్‌పిసియల్ సంస్థ ప్రతినిధులు కె.అప్పారావు, బి.యన్.రావ్, యుఎస్ఎస్ శర్మ పి.ఆర్.ఓ కాళీ, కె.జి.రఘురాం, సుధాజాన్ తెరియన్, స్ఫూర్తీ వేల్ఫేర్ అసోసియోషన్ అధ్యక్ష, కార్యదర్శులు అప్పన్న, సోమాలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోపాటు క్రీడలపట్ల ఆశక్తి చూపాలి



గాజువాక: చిన్నారులు విద్యతోపాటు క్రీడలపట్ల ఆశక్తి చూపాలని, క్రీడలలో ప్రతిభచాటి దేశానికి, తల్లిదండ్రులకు పేరుతేవాలని కరాటే శిక్షకులు అమరపిని శ్రీనివాసరావు పేర్కోన్నారు. జీవీయంసీ 50వ వార్డులోని రాజీవ్‌గాంధీ ఇండోర్ స్టేడియంలో జీవీయంసీ ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో 6,7, సంవత్సరాల వయసు గల చిన్నారులకు కోచ్ అమరిపిని శ్రీనివాసరావు కరాటేలో మెలుకువలు నేర్పారు. ఈ సంధర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చిన్నారులను క్రీడలపట్ల ఆశక్తి పెంపోందించుకునే విధంగా తల్లిదండ్రులు, ఉపాద్యాయులు ప్రోత్సహించాలని, క్రీడలలో రాణిస్తే ఉన్నత శిఖరాలను అందుకోవచ్చునని అన్నారు. ప్రతిభగల చిన్నారులను కోచ్ అమరపిని శ్రీనివాసరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే సీనియర్ ఇన్‌స్పెక్టర్, ఎ.వెంకట్రావు, గణేష్, నరేంద్ర, హర్ష, బాలు, మదుబాబు, బ్రహ్మాజీ,శ్రీరామ్, చిన్నారులు పాల్గొన్నారు.

## 29న రామనారాయణంలో హనుమాన్ జయంతి ఉత్సవ వేడుకలు

విజయనగరం: ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో ఈ నెల 29వ తేదీన హనుమాన్ జయంతి ఉత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నామని ప్రాంగణం పరిపాలనాధికారి ఉమామహేశ్వరరావు అన్నారు.

సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆహ్వాన ప్రతులను ఆవిష్కరించి మాట్లాడుతూ 29వ తేదీ బుధవారం ఉదయం ఆంజనేయస్వామికి సహస్రనామావళితో సింధూరము, లక్ష తమలపాకులు, తులసి దళాలు, కనకాంబరాలతో ప్రత్యేక పూజలు ఉంటాయని, విశేష అర్చన, మహానివేదన చేస్తారని, సాయంత్రం హనుమాన్ చాలీసా పారాయణం, విశేష అర్చన, మహాహారతి ఉంటుందని, భక్తులు అందరూ పాల్గొనాలని కోరారు.ఈ సమావేశంలో మేనేజర్ శ్రీనివాసరాజు, ప్రధాన అర్చకులు చాణక్య, ఎం వి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి సాగుతో అధిక దిగుబడి: జిల్లా కలెక్టర్

విజయనగరం: ఎరువులు, పురుగు మందులు వాడని ప్రకృతి సాగుతో మామిడి పంట ద్వారా అధిక దిగుబడి సాధించించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎం.హరిజవహర్‌లాల్ ఆకాంక్షించారు. మొరకముడిదాం మండలం గరుగుబిల్లి గ్రామ రైతు చిట్టూరి తిరుపతిరావు ప్రకృతి సాగుద్వారా పండించిన మామిడి పండ్లను కలక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులు ఎక్కువ మొత్తం ఆదాయం రావడమే కాకుండా ప్రజల ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని , ఎక్కువ మంది రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను చేపట్టి, భూసారం కాపాడుకోవాలని సూచించారు. రైతు తిరుపతిరావును కలక్టర్ అభినందించారు. వారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా ప్రకృతి వ్యవసాయంపై పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతున్నాయని వాటిని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. ప్రజలకు మంచి ఆహార ఉత్పత్తులు అందించాలన్నారు. రసాయనిక ఎరువులు వాడటం వల్లఆరోగ్యం , భూసారం పాడవుతుందని తెలిపారు. గరుగుబిల్లి గ్రామంలో ఎరువులు, పురుగు మందులు వాడకుండా ప్రకృతి సాగుద్వారా ఏడుఎకరాల మామిడితోటను ప్రకృతి సాగు పద్ధతులైన ఘన జవామృతం, ద్రవ జీవామృతం, పంచగవ్య వాడి తెగుళ్ళ నివారణకు నిమ్మాస్త్రం, పుల్లటి మజ్జిగ వాడి సాగు చేయ్యడం జరుతుందని తద్వారా మామిడి అధిగ దిగుబడి రావడం జరిగిందని రైతు తిరుపతిరావు వివరించారు. మామిడి తోటలో అంతర పంటలుగా వేరుశెనగ, కంది, చిక్కుడు,బీర పంటలు వేసి అదనపు ఆదాయం సంపాదించడం జరుగుతుందని తెలిపారు.

ప్రకృతి సాగుద్వారా పండించిన మామిడి పంటకు మంచి గిరాకీ ఉందని, రైతుబజార్లో విజయనగరం మార్కెట్‌లో కిలో 60 రూ.లు కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. మంచి ఆదాయం సంపాదించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆత్మ పిడి ఆశాదేవి, ప్రకృతి వ్యవసాయం డిపిఎం కె.ప్రకాష్, సీతానగరం వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరరావు, ప్రకృతి వ్యవసాయం ఏఓ జి.హేమసుందర్, రైతు కల్లెం త్రినాధ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాలలో మౌళిక వసతులు మెరుగు పర్చాలి

### ఎస్‌బిఐ సహకారం అందించాలి

### ఎస్‌బిఐ డిజిఎంతో చర్చించిన అరకు శాసన సభ్యులు శెట్టి ఫల్గుణ



అరకు: విశాఖజిల్లా గిరిజన ప్రాంతాలలో మౌళిక వసతుల కల్పనకు సహకరించాలని అరకు శాసన సభ్యులు శెట్టి ఫల్గుణ అన్నారు. సోమవారం ఉదయం ఆయన ఎస్‌బిఐ డిజిఎం దివాకర్, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. గిరిజన ప్రాంత సమస్యలపై ఆయన ఎస్‌బిఐ అధికారులతో సుధీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా శెట్టి ఫల్గుణ మాట్లాడుతూ గిరిజన ప్రాంత వాసులకు పరిశుభ్రమైన త్రాగు నీటిని అందించాలని, దీనికి అవసరమైన పరికరాలు ఎస్‌బిఐ సమకూర్చాలని కోరారు. సామాజిక బాధ్యత నిధులు(సిఎస్ఆర్)లో భాగంగా గిరిజన ప్రాంత అభివృద్ధికి అధికంగా నిధులు కేటాయించాలన్నారు. అరకు, పాడేరు ప్రాంతాలలో బ్యాంకింగ్ సేవలు పొందే వినియోగదారుల సంఖ్య పెరిగిందని, దీనికి అనుగుణంగా బ్యాంకులో సిబ్బందిని పెంపుదల చేయాలని, బ్యాంకుకు సువిశాలమైన అదనపు భవనాన్ని నిర్మించాలని సూచించారు. వినియోగదారులకు టోకెన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల నుంచి ఉన్నత చదువులకు వెళ్లే పేద విద్యార్థులకు అవసరమైన విద్యారుణాలు సత్వరం అందించాలని తద్వారా వారి సాధికారత సాధ్యపడుతుందన్నారు. గిరిజన ప్రాంతాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు గృహనిర్మాణ రుణాలు అందించడం, రైతులకు అవసరమైన వ్యవసాయ రుణాలను అందించాలని కోరారు. గిరిజన మారుమూల ప్రాంతాలలో నివశిస్తున్న మహిళలు ప్రసవ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం జరుగుతోందన్నారు. దీనిని నివారించే విధంగా అంబులెన్స్‌లు ఏర్పాటు చేయాలన్నారు.

రెండు అంబులెన్స్‌లను ఎస్‌బిఐ సహకారంతో ఏర్పాటు చేయాలని కోరారు. తద్వారా గర్భిణీలను ఆసుపత్రికి తీసుకువెళ్లడం, ప్రసవానంతరం ఇంటికి క్షేమంగా తీసుకువెళ్లడం సాధ్యపడుతుందన్నారు. శాసన సభ్యులు అందించిన సూచనలు, వినతుల పట్ల ఎస్‌బిఐ ఉన్నతాధికారులు సానుకూలంగా స్పందించారు. గిరిజన ప్రాంతాలలో అవసరమైన మౌళిక వసతుల కల్పనకు పూర్తిసహకారం అందిస్తామన్నారు.

నీటిశుద్ధి పరికరాల ఏర్పాటు, అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తామన్నారు. బ్యాంకులకు నూతన భవన నిర్మాణాలకు అవసరమైన స్థలాన్ని అందిస్తే సత్వరం భవనాల నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు.

# బ్లాక్‌చైన్ సంస్థలకు ప్రోత్సాహం

**- రాయితీ ధరలకు భూములు, పరిశోధనలకు నిధులు**

**- ఆకట్టుకుంటున్న తెలంగాణ బ్లాక్‌చైన్ ముసాయిదా విధానం**

హైదరాబాద్: నూతన ఆవిష్కరణలకు, ఔత్సాహిక వ్యాపార, పారిశ్రామికవేత్తలకు ఆది నుంచి అగ్ర తాంబూలం ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. మరోసారి బ్లాక్‌చైన్ ముసాయిదా విధానంతో పెద్దపీట వేసింది. రాయితీపై తక్కువ ధరలకే భూములు, పరిశోధనలకు నిధులను అందించడం, కట్టుదిట్టమైన నియంత్రణ, విధానపరమైన సహాయ సహకారాలు ఇవ్వ డం వంటివి తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన నూతన డ్రాఫ్ట్ బ్లాక్‌చైన్ పాలసీ ము ఖ్యాంశాలు. బ్లాక్‌చైన్ ఆధారిత సంస్థలు, స్టార్టప్‌లను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ పాలసీని ప్రభుత్వం రూపొందించింది. ఈ నెల 17న విడుదలైన ఈ డ్రాఫ్ట్ పాలసీ.. రాష్ట్రంలో ముఖ్యంగా రాజధాని హైదరాబాద్‌లో బ్లాక్‌చైన్ సంస్థల ఏర్పాటుకు ఔత్సాహికులను ఆకట్టుకునేలా తగిన ప్రోత్సాహకాలతో ముందుకొచ్చింది.

**బ్లాక్‌చైన్‌దే భవిష్యత్తు**

భవిష్యత్తు అంతా బ్లాక్‌చైన్‌దేనని తెలుసుకున్న రాష్ట్ర ప్రభుత్వం.. దానికి పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలను ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే మొదటి మూడేండ్లపాటు సంస్థ కార్యకలాపాల నిమిత్తం ఏటా రూ.5 లక్షల వరకు లీజ్ రెంటల్స్ 25 శాతం రాయితీని ప్రభుత్వం ప్రతిపాదించింది. స్టార్టప్‌ల కోసం రాష్ట్ర జీఎస్టీలో 100 శాతం రీయింబర్స్‌మెంట్, 10 శాతం వరకు ఆర్‌అండ్‌డీ గ్రాంట్, మూడేండ్లు ఏటా పది బ్లాక్‌చైన్ స్టార్టప్‌లకు ఏకకాల గ్రాంట్‌గా రూ. 10 లక్షలను ఇవ్వనున్నది. అలాగే అన్ని బ్లాక్‌చైన్ స్టార్టప్‌లకు ఆఫీస్ స్పేస్‌ను కల్పించనున్నది. ఈ క్రమంలోనే అంతర్జాతీయ సంస్థల సహకారంతో బ్లాక్‌చైన్ డిస్ట్రిక్ట్‌ను ఏర్పాటు చేస్తున్నది. దేశంలోనే ఇది తొలి బ్లాక్‌చైన్ డిస్ట్రిక్ట్ అవనుండగా, హైదరాబాద్ పరిధిలో ఇది కొలువుదీరేలా ముందుకెళ్తున్నది సర్కారు. గతేడాదే దీని ప్రారంభానికి టెక్ మహీంద్రాతో తెలంగాణ సర్కారు ఒప్పందం కూడా చేసుకున్న విషయం తెలిసిందే. అన్ని ప్రధాన బ్లాక్‌చైన్ టెక్నాలజీ సంస్థల భాగస్వామ్యంతో ఇదో పెద్ద ఇంక్యుబేటర్‌గానేగాక పరిశోధనలు, నూతన ఆవిష్కరణల కోసం ప్రపంచ శ్రేణి సౌకర్యాలను కలిగి ఉండనున్నది. బ్లాక్‌చైన్ టెక్నాలజీలో పరిశోధనలకూ రాష్ట్ర ప్రభుత్వం నిధులను అందివ్వనుండగా, ఎంపిక చేసిన పలు ప్రధాన ఇనిస్టిట్యూట్లలో ఈ పరిశోధనలను నిర్వహించనున్నది. 2025 నాటికి బ్లాక్‌చైన్ టెక్నాలజీ.. గ్లోబల్ జీడీపీలో 10 శాతాన్ని ఆక్రమిస్తుందన్నది అంచనా. 2030 నాటికి ఏటా 3 లక్షల కోట్ల డాలర్ల వ్యాపారాన్ని సృష్టిస్తుందన్నది నిపుణుల మాటగా ఉండటం గమనార్హం.




**సరళతర వ్యవస్థ**

దేశంలోనే తెలంగాణను బ్లాక్‌చైన్ రాజధానిగా నిలబెట్టేందుకు వచ్చిన ఈ పాలసీలో తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్ఐఐసీఎల్) బ్లాక్‌చైన్ సంస్థలకు రాయితీపై భూ కేటాయింపులను జరుపనున్నది. ఇక మార్గదర్శకాలనూ సరళతరం చేశారు. వార్షిక ఆదాయం, పెట్టుబడుల హామీలు, ఉద్యోగావకాశాలు వంటి వాటిల్లో రెగ్యులర్ ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీ (ఐసీటీ) సంస్థలకు సూచించిన నిబంధనలను బ్లాక్‌చైన్ సంస్థల కోసం తాజా పాలసీలో సవరించారు. బ్లాక్‌చైన్ అనేది ఓ కట్టుదిట్టమైన వ్యవస్థ అన్న విషయం తెలిసిందే. కీలకమైన సమాచారాన్ని భద్రపరుచడం, ఆ డేటాను నిల్వ చేసి పంపిణీ మాత్రమే అ య్యేలా, మార్పులు లేకుండా కాపీ చేసుకునేందుకు అవకాశాన్నిస్తుంది. టాంపరింగ్‌కు వీల్లేకుండా సాయపడుతుంది.

# జీఎమ్మార్‌కు ఊరట

**- కాంట్రాక్టు నష్టపరిహారంపై పన్నులు చెల్లించనక్కర్లేదన్న మాల్దీవుల ప్రభుత్వం**

హైదరాబాద్: దేశీయ మౌలిక రంగ దిగ్గజాల్లో ఒకటైన జీఎమ్మార్ గ్రూపునకు గొప్ప ఊరట లభించింది. మాలే అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు కాంట్రాక్ట్ నష్టపరిహారంపై తాము డిమాండ్ చేసిన పన్నులను అక్కడి ప్రభుత్వం వదులుకున్నది. ఈ పన్నులు, జరిమానాల కోసం జీఎమ్మార్‌పై ఒత్తిడి తీసుకురావద్దని మాల్దీవుల సర్కారు నిర్ణయించింది. ఈ క్రమంలోనే ఆ పన్నులు చెల్లించాల్సిన అవసరమేమీ లేదని స్పష్టం చేసింది.

ఈ మేరకు మాల్దీవుల అటార్నీ జనరల్స్ కార్యాలయం ఓ ప్రకటన కూడా విడుదల చేసింది. మాలేలోని ఇబ్రహిం నాసిర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు అభివృద్ధి, విస్తరణ, ఆధునికీకరణ, నిర్వహణ, కార్యకలాపాల నిమిత్తం 2010 జూన్ 28న మాల్దీవుల ఎయిర్‌పోర్ట్స్ కంపెనీ లిమిటెడ్ (ఎంఏసీఎల్)తో, అక్కడి ఆర్థిక, కోశాగార మంత్రిత్వ శాఖలతో జీఎమ్మార్ గ్రూప్ ఒప్పందం కుదుర్చుకున్నది. 25 ఏండ్లకుగాను ఈ ఒప్పందం కుదరగా, 2012 నవంబర్‌లో దీన్ని ఎంఏసీఎల్ అనూహ్యంగా రద్దు చేసింది. దీంతో జీఎమ్మార్ గ్రూప్ అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. సింగపూర్‌లోని ఈ ట్రిబ్యునల్ జీఎమ్మార్‌కు అనుకూలంగా తీర్పు చెప్పింది. 270 మిలియన్ డాలర్ల నష్టపరిహారం చెల్లించాలని ఎంఏసీఎల్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో 2017-18కిగాను ట్యాక్స్ ఆడిట్ రిపోర్టులను జారీ చేసిన మాల్దీవుల ఇన్‌లాండ్ రెవిన్యూ అథారిటీ.. సదరు నష్టపరిహారంపై ఆదాయం పన్ను విధించిం ది. అంతేగాక చెల్లింపుల జాప్యంపై జరిమానాలనూ వేస్తూ వచ్చింది. ఈ మొత్తం 20.5 మిలియన్ డాలర్లకు (సుమారు రూ.137 కోట్లు) చేరింది. మరోవైపు తాజా నిర్ణయాన్ని జీఎమ్మార్ అధికార ప్రతినిధి స్వాగతించారు. ఆదివారం పీటీఐకి పంపిన ఓ ఈ-మెయిల్‌లో నష్టపరిహారంపై ఎలాంటి పన్నులు చెల్లించనక్కర్లేదన్న జీఎమ్మార్ వాదనతోనే చివరకు మాల్దీవుల ప్రభుత్వం ఏకీభవించడం హర్షణీయం అన్నారు.

# హారర్ థ్రిల్లర్ అభినేత్రి-2



ప్రభుదేవా, తమన్నా జంటగా నటిస్తున్న తాజా చిత్రం అభినేత్రి-2. ఏ.ఎల్. విజయ్ దర్శకుడు. ఈ నెల 31న తెలుగు, తమిళ భాషల్లో విడుదలకానుంది. అభిషేక్ నామా, ఆర్.రవీంద్రన్ నిర్మిస్తున్నారు. ఇటీవల ఈ చిత్ర తెలుగు ట్రైలర్‌ను విడుదల చేశారు. నిర్మాతలు చిత్ర విశేషాలు తెలియజేస్తూ టీజర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లో కొనసాగుతున్నది. వినోదం మేళవించిన హారర్ థ్రిల్లర్‌గా ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగుతుంది. నాయకానాయికలు ఎందుకు దయ్యాలుగా మారారనే అంశం ఆసక్తికరంగా అనిపిస్తుంది అన్నారు. నందితాశ్వేత, సప్తగిరి, సోనూసూద్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: అయంకబోస్, సంగీతం: శామ్ సి.ఎస్.

# మామూలుగా ఉండదు!



సమంత కథానాయికగా నటిస్తున్న తాజా చిత్రం ఓ బేబి. బి.వి.నందినిరెడ్డి దర్శకురాలు. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. నా పేరు సావిత్రి. చిన్నప్పుడు అందరూ నన్ను భానుమతిలా ఉన్నావు అనేవాళ్లు...మీరు నన్ను పాతికేళ్లప్పు డు చూడాల్సింది.. అనే సంభాషణతో టీజర్ మొదలైంది. మీకు బాయ్‌ఫ్రెండ్స్ ఎవరూ లేరు కదా అని నాగశౌర్య..సమంతను ప్రశ్నించగా..నేను మంచి వయసులో ఉన్నప్పుడు మా ఆయన పోయారు. అప్పటికే నానిగాడు పుట్టేశాడు. ఇంకా మళ్లీ పెళ్లి పెటాకులు ఎందుకని..వాడ్ని పెంచి పెద్దచేశా. వాడు పెళ్లి చేసుకొని ఇద్దరిని కన్నాడు. వాళ్లూ పెళ్లీడూకొచ్చారు. నాకు వయసైపోయింది అంటూ సమంత చెప్పే డైలాగ్ చక్కటి వినోదాన్ని పంచుతున్నది. చివరగా నాతో ఎంజాయ్‌మెంట్ మామూలుగా ఉండదు. క్కొక్కడికి...చూస్తారుగా అంటూ సమంత పలికిన డైలాగ్ హైలైట్‌గా నిలిచింది. ఈ చిత్రంలో లక్ష్మి, నాగశౌర్య, రావు రమేష్, రాజేంద్రప్రసాద్ కీలక పాత్రల్ని పోషిస్తున్నారు. కొరియన్ చిత్రం మిస్‌గ్రానీకి రీమేక్ ఇది. జూలైలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరా: రిచర్డ్‌ప్రసాద్, ఆర్ట్: విఠల్, సంగీతం: మిక్కీ జె మేయర్, నిర్మాతలు: సురేష్‌బాబు, సునీత తాటి, టి.జి.విశ్వప్రసాద్, హ్యూవు థామస్‌కిమ్, దర్శకత్వం: బి.వి.నందినిరెడ్డి.

# చిత్రభాను

# సినీ ప్రయాణం రేసు కాదు!

**కథ, పాత్రల పరంగా నవ్యత ఉండాలి. సెట్స్‌లో ప్రతిరోజు కొత్తదనం కనిపించాలి. ఆ ఉత్సుకత లేకపోతే సినిమాల్ని చేయను అని చెప్పింది రకుల్‌ప్రీత్‌సింగ్. తెలుగుతో పాటు తమిళ, హిందీ భాషల్లో చక్కటి అవకాశాలతో దూసుకుపోతున్నది రకుల్. ఆమె కథానాయికగా నటించిన తమిళ చిత్రం ఎన్‌జీకే అదే పేరుతో తెలుగులో విడుదలవుతున్నది. సెల్వరాఘవన్ దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ నెల 31న విడుదలకానుంది. ఈ సందర్భంగా రకుల్‌ప్రీత్‌సింగ్ పాత్రికేయులతో పంచుకున్న ముచ్చట్లివి...**

పొలిటికల్ థ్రిల్లర్ కథాంశంతో ఎన్‌జీకే చిత్రం రూపొందింది. వనతి అనే స్వతంత్ర్యభావాలు కలిగిన రాజకీయ నాయకురాలిగా నా పాత్ర శక్తివంతంగా సాగుతుంది. నా ఆలోచన విధానాలు, పనులన్నీ ఊహలకు అందకుండా విభిన్నంగా ఉంటాయి. దర్శకుడు సెల్వరాఘవన్ కథ చెప్పినప్పుడే ఛాలెంజింగ్‌గా అనిపించింది. అది నచ్చే ఈ సినిమాను అంగీకరించాను. నా కెరీర్‌లో ఇప్పటివరకు చేయని సరికొత్త పాత్ర ఇది. రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఓ సామాన్య యువకుడి విజయంలో నా పాత్ర ఎంతవరకు ఉంటుందన్నది ఆకట్టుకుంటుంది. కల్పిత కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రమిది. నిజజీవిత సంఘటనలతో సంబంధం ఉండదు.

క్లాప్ బోర్డ్ ఉండదు..

సెల్వరాఘవన్ సినిమాను, పాత్రలను తీర్చిదిద్దిన విధానం విభిన్నంగా ఉంటుంది. ఎంత పెద్ద సంభాషణ అయినా చెప్పేటప్పుడు కనురెప్పలు మూయొద్దంటారు. అలా చేస్తే సన్నివేశంలోని ఎమోషన్, కంటిన్యూటీ మిస్ అవుతుందని చెబుతుంటారు. అలాగే యాక్షన్ చెప్పిన తర్వాత మూడు సెకన్లు ఆగిన తర్వాతే డైలాగ్ చెప్పాలనే నియమం ఉంది. అలాగే నటులకు డిప్రెషన్ వస్తుందని షుటింగ్‌లో క్లాప్‌బోర్డ్‌ను ఉపయోగించరు.తొలినాళ్లలో ఆయన శైలిని అర్థం చేసుకుంటూ నటించడానికి నాలుగైదు రోజుల సమయం పట్టింది. ఎలాంటి రిహార్సల్స్ లేకుండా షుటింగ్‌కు వెళ్లి ఆయన చెప్పినవి అర్థం చేసుకుంటూ నటించడం సవాల్‌గా అనిపించింది. ఈ సినిమాతో నటిగా చాలా నేర్చుకున్నాను.

తప్పులు వెతకడం సులభం..

ప్రస్తుతం దేశంలోని ప్రజలంతా రాజకీయాలు తప్ప వేరే అంశాల గురించి మాట్లాడటం లేదు. నేను నా గళాన్ని వినిపిస్తాను. దేశంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. తప్పులు వెతకడం చాలా సులభం. నేను చుట్టుపక్కల ఏం జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటుంటాను.

అవగాహన చాలా ముఖ్యం

విద్యావంతులు రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం చాలా ఉంది. అప్పుడే దేశంలో ఉన్న సమస్యలు చాలా వరకు పరిష్కారమవుతాయి. ఎమ్‌బీఏ, ఇంజనీర్ కావాలంటే అన్నింటికి ఓ నియమనిబంధనలు ఉన్నాయి. కానీ రాజకీయాల్లోకి రావాలంటే మాత్రం ఎలాంటి నియమాలు, పద్ధతులు లేవు. దీనిపట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం చాలా ముఖ్యం. అప్పుడే మార్పు కోరుకునే యువత రాజకీయాల్లోకి వచ్చే అవకాశం ఉంది. రాజకీయాల్లోకి రావడానికి ప్రత్యేకమైన సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలి.



రేస్ కాదు..

స్పైడర్ తర్వాత హిందీ, తమిళ భాషల్లో అవకాశాలు రావడంతో తెలుగులోవిరామం వచ్చింది. దేదే ప్యార్‌దే సినిమా చేయడానికి ఏడు నెలల సమయం పట్టింది. ఆ తర్వాత తమిళ సినిమాలతో బిజీగా మారిపోయాను. ఈ విరామంలో తెలుగులో చాలా కథలు విన్నాను. కానీ సమయం లేకపోవడంలో నటించడం కుదరలేదు. గ్యాప్ ఉండకూడదని అనుకోవడానికి సినీ కెరీర్ రేసు కాదు. భాష ఏదైనా మంచి సినిమా చేయడమే నాకు ముఖ్యం. ఏడాదికి నాలుగైదు మించి సినిమాలు చేయను.

వయసు ముఖ్యం కాదు.

నాయకానాయికల వయసుల కంటే కెమిస్ట్రీ వర్కవుట్ అయ్యిందా లేదా అన్నదే నాకు ముఖ్యం. ప్రస్తుతం నేను సీనియర్ హీరోలతో సినిమాలు చేస్తున్నాను. కథానుగుణంగా జోడీ కుదిరిందని అనిపించినప్పుడే ప్రేక్షకులు నాయకానాయికల మధ్య వయోభేదాల గురించి ఆలోచించకుండా సినిమా చూస్తారు. మన్మథుడు-2 చిత్రంలో హీరో నాగార్జున పోల్చితే నా వయసు చాలా తక్కువగా ఉంటుంది. కెరీర్ ప్రారంభంలో పాత్రల ఎంపికపై అవగాహన ఉండేది కాదు. కాలమే అన్ని నేర్పించింది.

సైనా నెహ్వాల్ బయోపిక్‌లో..

బయోపిక్‌లలో నటించాలనుంది. సైనా నెహ్వాల్ జీవిత కథలో నటించాలని అనుకున్నాను. కానీ కుదరలేదు. మనకు తెలియని ఎంతో మంది గొప్ప వ్యక్తుల జీవితాల గురించి చెప్పడానికి సినిమా మంచి మాధ్యమంగా ఉపయోగపడుతుంది.

## విశాఖ ఎంపీ ఎం.వి.వికు
# అభినందనల వెల్లువ



విశాఖసిటీ: జీవీఎంసీ 19వ వార్డు వైస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి సాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ ఏవి మాట్లాడుతూ శక్తివంచన లేకుండా విశాఖ నగర అభివ ృద్ధికి క ృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజన్నరాజ్యం ద్వారా రాష్ట్ర ప్రజలందరికీ చక్కటి పాలన అందించబోతున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు నాయకులు, ఇంచార్జ్ శ్రీ పల్లా దుర్గారావు, తెలుగు జయప్రకాశ్, తోటపల్లి లక్ష్మి నారాయణ, నక్క సావిత్రి, వర్రి నాగమణి, యందవా సావిత్రి, అరుణశ్రీ, అబ్బాస్, ఆనంద్, చెట్ల మధు తదితరులు పాల్గొన్నారు.

## సత్యదేవుని హుండీ ఆదాయం
# 18 రోజులకు రూ.1.1 కోట్లు




అన్నవరం: తూ.గో.జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రము అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం తాలూకా హుండీలు లెక్కింపు సోమవారం నిర్వహించారు. గడచిన 18 రోజులుకు గాను సత్యదేవుని హుండీల ఆదాయం రూ.1,01,10, 808/-( ఒక కోటి,ఒక లక్ష,పదివేల,ఎనిమిది వందల ఎనిది రూపాయలు) రాగా బంగారం 110 గ్రాములు, వెండి 630 గ్రాములు,యుఎస్ఏ కరెన్సీ 5 డాలర్లు,క్వార్టర్ సెంట్రల్ బ్యాంకు 11 రియల్,సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ సిరియా 1100 సిరియా పౌండ్స్,మరియు ఇతర విదేశీ మారక ద్రవంతో పాటు రద్దయిన కరెన్సీ రూ.22,000/- లభ్యమయ్యాయి.ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో ఈవో ఎం.వి.సురేష్ బాబు, ఏసి.ఈరంకి.జగన్నాధరావు,పిఆర్వో తులా. రాముడు, పాలకమండలి సభ్యులు,దేవస్థానం అధికారులు,సిబ్బంది, పురోహితులు, అర్చకులు,నాయీ బ్రాహ్మణులు,శ్రీహరి సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 2న ఎపిఇపిడిసిఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వ్రాతపరీక్ష హాల్‌టిక్కెట్లు లభ్యం

విశాఖపట్నం: జూన్ 2న జరుగుతున్న ఎపిఇపిడిసిఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎలక్ట్రికల్) నియామక పరీక్షకు సంబంధించి అర్హులైన అభ్యర్థులు హాల్ టిక్కెట్లు పరీక్ష తేదికు ముందు డౌన్‌లోడ్ చేసుకోగలరు.

### థాయ్ అంతర్జాతీయ నృత్యోత్సవానికి
# టీనా, నైనిత ఎంపిక

విశాఖ సిటీః థాయ్‌లాండ్ శ్రీనిఖరిన్ విరాట్ యూనివర్శిటీ ఫైన్ ఆర్ట్స్ విభాగం జూన్ 12వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న 9వ అంతర్జాతీయ నృత్యోత్సవం, జానపద సాంస్కృతిక సదస్సుకు విశాఖ నుంచి ఆర్‌హెచ్ టీనా, వడ్డి నైనితలు హాజరవుతున్నారని స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ డైరెక్టర్ ఆర్. జానకి పేర్కొన్నారు.

సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో చదువుతున్న టీనా, నైనితలు గతంలో న్యూఢిల్లీలో జరిగిన ఇంటర్నేషనల్ ఫోక్‌లెర్ ఫెస్టివల్‌లోనూ, ఒడిస్సా రాష్ట్రం డయోగర్‌లో జరిగిన టూరిజం ఫెస్టివల్‌లోనూ, బాలభవన్ సొసైటీ ఆఫ్ ఇండియా (న్యూఢిల్లీ) నిర్వహించిన జాతీయ యువత కళా ప్రతిభా ప్రదర్శనలోను, కర్ణాటక రాష్ట్రంలోని కడూరు, షిమోగల్లో జరిగిన జాతీయ బహుభాషా నృత్యోత్సవాలలోనూ, విశాఖ ఉత్సవ్‌లోని పలు జానపద నృత్యాలను ప్రదర్శించారన్నారు.

స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ కొరియోగ్రాపర్ నాగరాజ్ పట్నాయక్ వద్ద వీరు పలు భాషల్లో నృత్యాలలో శిక్షణ పొందుతూ చిన్న వయస్సులోనే రాష్ట్ర సాంస్కృతిక శాఖ గుర్తింపు కార్డును పొందారు. మెక్సికో, కోరియా, శ్రీలంక, ఇండోనేషియా, బల్గేరియా, నేపాల్, బంగ్లాదేశ్, ఫిలిప్పిన్స్, థాయ్‌లాండ్ వంటి దేశాల నుంచి సుమారు 16 వరకు జానపద కళా బృందాలు హాజరవుతున్న ఈ అంతర్జాతీయ జానపద నృత్యోత్సవాలకు టీనా, నైనితలు నగరాజు పట్నాయక్ నృత్యరీతులను సమకూర్చిన ఆంధ్రా, పంజాబీ జానపద నృత్యాలను ప్రదర్శిస్తారన్నారు. విశాఖ నగరం నుంచి హాజరవుతున్న టీనా, నైనితలకు డిఇఓ బి. లింగేశ్వర్ రెడ్డి, ఎస్ఎఫ్ఎస్ స్కూల్ ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డిలు అభినందించారు.

### భీమిలి నియోజకవర్గ అభివృద్ధికి
# శక్తివంచన లేకుండా కృషి చేస్తా

**ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు**




డాబాగార్డెన్స్: ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో భీమిలి నియోజకవర్గంకి ప్రాతినిధ్యం వహించి ఘన విజయం సాధించిన వైస్సార్సీపీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు (అవంతి అధినేత) నగరంలో మేఘాలయ హెూటల్లో వైజాగ్ జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు ఆధ్వర్యంన జరిగిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకి ... జిల్లా మరియు భీమిలి నియోజకవర్గ పరిధిలో ఉన్న సమస్యలను, వాటి మీద పరిష్కరించే మార్గాల కొరకు ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం నుంచి ఎదురైన అన్ని ఇబ్బందులు ను సమర్థవంతంగా పరిష్కారం చూపే విధంగా చర్యలు తమ ప్రభుత్వం లో ఉంటాయని. విశాఖపట్నం భూకుంభకోణంలో ఉన్నవారు, ఎంతటివారైనా వదిలిపెట్టమని తప్పక ప్రజల పక్షాన నిలబడి చట్టం ప్రకారం అన్ని చర్యలు తప్పకుండా జరుగుతాయన్నారు. తమ ప్రభుత్వం పేదల కోసం విద్య,వైద్యం, అవసరాలు తీర్చేవిధంగా తమ ప్రభుత్వం పాలన చేస్తుందని, పార్టీలకు అతీతంగా పేదవారి సంక్షేమం కోసం పాటుపడతామని, చంద్రబాబు ప్రభుత్వం తమ అబద్దాలు, అవినీతి వలన ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఎటువంటి తప్పులు కి అవకాశం లేకుండా పరిపాలన అందిస్తారని, అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేసేలా ప్రజల కి అందుబాటులో ఉండే విధమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నగరంలో కేజీహెచ్, విమ్స్, ల ఆసుపత్రుల అభివ ృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన కు ఒక మంచి కార్యాచరణ తో ముందుకు వెళ్తామని , సామాన్యులకు ఎటువంటి కష్టాలు ,ఇబ్బందులు రాకుండా కాపాడుకోనే రీతిలో వైస్సార్సీపీ , వైస్సార్ పాలన ఏలా అయితే ప్రజల మన్ననలు పొందిందో అలాగే ఇపుడు జగన్మోహన్ రెడ్డి పాలన లో కూడా అటువంటి పేరు తెచ్చుకుంటామని, ఎవరిపై కక్షసాధింపులు ఉండవని , ప్రతి నియోజకవర్గంలో ఒక జూనియర్ కాలేజ్ ఏర్పాటు కు , చిట్టివలస జ్యూట్ మిల్లు అభివ ృద్ధికి, సమస్యలు పరిష్కారం కోసం తమ ప్రభుత్వం అడుగులు వేస్తుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో లో ఎం పీ ఎంవీవీ, వైకాపా నేతలు కే కే. రాజు, అక్రమాన్ని విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.

# మునిసిపల్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి



విశాఖ సిటీః జివిఎంసి మునిసిపల్ కాంట్రాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రొంగలి జగన్నాథం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రముఖ హెూటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ హయాంలోని మునిసిపాలిటీ కార్పొరేషన్ వ్యవస్థలో కాంట్రాక్టర్లుఅనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాటిని వెంటనే పరిష్కరించాలని జగన్నాథం పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ సెక్రటరీ పి.వి. సత్యం, కృష్ణారావు, రవీంద్రనాథ్, నరసింగరావు, సిహెచ్. ప్రసాదరావు, శశిధర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మోదీ ప్రమాణస్వీకారోత్సవానికి జగన్?

అమరావతి: ఈ నెల 30న ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయనున్న వైకాపా అధ్యక్షుడు జగన్.. అదే రోజు సాయంత్రం జరిగే మోదీ ప్రమాణస్వీకారోత్సవానికి హాజరయ్యే అవకాశముంది. విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరగనున్న జగన్ ప్రమాణస్వీకారానికి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరుకానున్న విషయం తెలిసిందే.

ఒక రోజు ముందు కేసీఆర్ విజయవాడ చేరుకుంటారు. ప్రమాణస్వీకారం పూర్తయిన తర్వాత కేసీఆర్‌తో కలిసి జగన్ దిల్లీ వెళ్లే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. వీరివెంట వైకాపాకు చెందిన కొందరు సీనియర్ నేతలు కూడా పయనం కానున్నట్లు సమాచారం.

# రాష్ట్ర పరిపాలన జనరంజకంగా ఉండాలి

| ధర్మాన్ని పరిరక్షించేది పీఠాలు, మఠాలు మాత్రమే | శ్రీ శారదా పీఠానికి వైకాపా నేతల క్యూ |
|---|---|
| పీఠాలు, పీఠాధిపతుల జోలికిపోరాదు | వైకాపా నేతలకు శ్రీచరణుల ఆశీర్వాదం |






విశాఖ సిటీ: ఎంతో విశిష్టత చెందిన విశాఖ శ్రీ శారదా పీఠానికి వైసీపీ నేతలు క్యూ కడుతున్నారు. ఎన్నికల్లో విజయం సాధించిన వైసీపీ ఎం ఎల్ ఏ లు గత మూడు నాలుగు రోజులుగా విశాఖ వచ్చి పీఠాధిపతి శ్రీ స్వరూపానంద సరస్వతీ మహాస్వామిని కలిసి ఆశీర్వాదాలు తీసుకుంటున్నారు. సోమవారం ఉదయం అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, మాడుగుల ఎమ్మెల్యే బూడి ముత్యాల నాయుడు, వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, రాయదుర్గం ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శారద పీఠాన్ని దర్శించుకున్నారు. వైయస్సార్సీపి ఆధ్వర్యంలో రాష్ట్ర పరిపాలన మరింత జనరంజకంగా ఉండేటట్లు చేయబోతున్నట్లు వైకాపా నేతలు పేర్కొన్నారు.






VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 K Phone : 2564353, Fax : 0891-2569004 K e-mail: vijayabhanudaily@gmail.com